
కనువిందుగా దీపశోభ



డ్రోన్ కెమెరాకు ఫిష్ ఐ లెన్సుతో తీసిన మైసూరు ప్యాలెస్ చిత్రం

బెంగళూరు (గ్రామీణం): శరన్నవరాత్రులను పురస్కరించుకుని మైసూరు, మంగళూరు, శ్రీరంగపట్టణ, ఉడుపి తదితర ప్రాంతాల్లోని ఆలయాలు, పారంపర్య కట్టడాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. రాత్రుళ్లు ఈ దీపశోభను చూసేందుకు పర్యాటకులు, స్థానికులతో పాటు ఛాయాచిత్ర గ్రాహకులు పోటీ పడుతున్నారు. కొన్నిచోట్ల సమాచారం శాఖ అధికారుల అనుమతితో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి ఫొటోలను తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. విద్యుత్తు దీపాల వెలుగులో ఆయా కట్టడాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.



రాజ ప్రాసాదం ఎదుట ఇంగ్లిష్‌బ్యాండ్ వాయిస్తున్న రక్షకులు

నగరాన.. దంచికొట్టిన వాన

వణికిన బెంగళూరు



ముంపునకు గురైన యలహంక కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. 16 నుంచి 130 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ప్రహరీ కూలి వాహనాలపై పడటంతో దెబ్బతిన్నాయి. ఇళ్లలోకి నీరు ప్రవహించడంతో నివాసదారులు రాత్రంతా జాగారం చేశారు. బెంగళూరు ఉత్తర భాగంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు ముంపునకు గురైన యలహంకలోని కేంద్రీయ విహార అపార్ట్‌మెంట్‌లోకి మురుగునీరు చేరింది. మూడు అడుగుల లోతులో మురుగు రావడంతో అక్కడున్న 180 కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న కాలువపై నిర్మించిన గోడ కూలిపోవడంతో నీరు లోపలకు వచ్చినట్లు గుర్తించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక్కసారిగా నాలుగు అడుగులు నీరు అపార్ట్‌మెంట్ ఖాళీ ప్రదేశంలోకి వచ్చి నిలబడ్డాయి. ఆ సమయంలో అపార్ట్‌మెంట్ వాసులు పాలికె అధికారులకు ఫోన్ చేసినా అటు వైపు స్పందన రాలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఆ ప్రదేశాన్ని స్థానిక శాసనసభ్యుడు ఎస్.ఆర్.విశ్వనాథ్ అధికారులతో కలిసి పరిశీలించారు. చుట్టూ నీరు నిలబడటంతో నివాసదారులు ట్రాక్టర్ల సాయంతో బయటకు వచ్చారు. కొందరు ఇళ్లను ఖాళీ చేసి బయట హోటళ్లలో గదులు అద్దెకు తీసుకున్నారు. మూడేళ్ల కిందట అపార్ట్‌మెంట్ ముంపునకు గురైన నేటి వరకు ముంపు నుంచి ఆ ప్రదేశాన్ని సంరక్షించే చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

- బిన్నిపేటలోని పార్క్‌వ్యూవ్ అపార్ట్‌మెంట్ చుట్టు ఉన్న ఏడు అడుగుల ఎత్తు కలిగిన ప్రహరీ కూలిపోయింది. ప్రహరీ కింద పార్కింగ్ చేసిన వాహనాలపై రాళ్లు పడి 20 వాహనాలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. పాలికె సిబ్బంది, అపార్ట్‌మెంట్ సిబ్బంది కలిసి రాళ్లను తొలగించారు. ఈటీసీ మాల్ వద్ద ప్రహరీ కూలింది. దాసరహళ్లిలోని ఓ లే అవుట్‌లో ఇళ్లలోకి నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఇంట్లోకి వచ్చిన నీరు బయటకు పంపించారు. రాజాజినగర, మంజునాథ్‌నగరలో కొన్ని ఇళ్లలోకి వచ్చిన నీటిని ఆదివారం ఉదయం పాలికె సిబ్బంది వచ్చి బయటకు పంపించే ప్రయత్నాలు చేశారు.
- బిన్నిపేట, యలహంక, బసవేశ్వరనగర, పుట్టనహళ్లి, దాసరహళ్లి, సర్జాపుర, రాజాజినగర తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బసవేశ్వరనగరలో ఉన్న వృద్ధాశ్రమంలోకి నీరు రావడంతో అక్కడ నివసిస్తున్న వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు. బిన్నిపేటలో 45 ఇళ్లలోకి వాననీరు రావడంతో ఇళ్లలో ఉన్న ఆహార ధాన్యాలు, దుస్తులు, పుస్తకాలు తడిసినట్లు బాధితులు వాపోయారు. వర్ష ప్రభావం 49 ప్రాంతాలపై పడిందని, బసవేశ్వనగరలో 109.50 మిల్లీమీటర్లు, నాగపురలో 104 మి.మీ., హంపీనగరలో 102 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రానిక్ సిటీ, సర్జాపుర, దాసరహళ్లి తదితర ప్రాంతాల రహదారులు వాగులుగా మారాయి. ఎలక్ట్రానిక్ సిటీ రహదారి పక్క ఉన్న గుంతలు నిండి నీరు రహదారిపై ప్రవహించడంతో వాగులా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాల్లో పాలికె అధికారులు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.



సర్జాపుర రహదారిలో వాననీటిలో వాహనదారుల ఇక్కట్లు



దాసరహళ్లిలోని ఓ ఇంట్లోకి నీరు చేరడంతో మునిగిన వస్తువులు



వాగులా మారిన ఎలక్ట్రానిక్ సిటీ రహదారి



కూలిన ఇంటి నుంచి సామగ్రి తీసుకువెళుతున్న మహిళ



బోటులో సురక్షిత ప్రాంతానికి తరలివెళుతున్న మహిళలు

మంగళవారం వరకు ఎల్లో అలర్ట్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: కర్ణాటకలో వరుణార్భాటం పెరిగింది. మంగళవారం వరకు బెంగళూరుతో పాటు 16 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చామరాజనగర, చిక్కబళ్లాపుర, చిక్కమగళూరు, దావణగెరె, హాసన, కొడగు, మండ్య, మైసూరు, రామనగర, తుమకూరు, దక్షిణ కన్నడ, ఉడుపి, తుమకూరు జిల్లాలో ఎల్లో అలర్ట్ ప్రభావం ఉంటుంది. నగరంలో 36 మి.మీ. వర్షపాతం, హెచ్ఏఎల్ పరిధిలో 29 మి.మీ., కొడగులో అత్యధికంగా 9 సెం.మీ., వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం ప్రాంతీయ డైరెక్టర్ సీఎస్ పాటిల్ తెలిపారు. ఉత్తర కన్నడ జిల్లాలోనూ కొండచరియలు విరిగి పడే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. అలాంటి ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే సతీశ్ శైల్ తెలిపారు.

'నా అరెస్టుకు కుట్ర'

మైసూరు, న్యూస్‌టుడే: న్యాయం కోసం పోరాటం చేస్తున్న తనను అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముడా అక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసినప్పటి నుంచి వేధింపులు ఎక్కువ అయ్యాయని తెలిపారు. తనపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు పూర్వాపరాలు ఆలోచించకుండా విచారణకు హాజరు కావాలంటూ వేధిస్తున్నారని ఆక్రోశించారు. తాను మొదటి నుంచి పోరాటం చేసుకుంటూ వస్తున్నానని, పోరు విషయంలో రాజీ పడబోనని స్పష్టం చేశారు.

ఎయిర్‌షోకు తేదీలు ఖరారు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: యలహంక ఎయిర్‌బేస్‌లో 2025 ఫిబ్రవరి 10-14 వరకు 15వ ఎయిర్‌షో నిర్వహించేందుకు తేదీలు ఖరారయ్యాయి. అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, సుఖోయ్, సూర్యకిరణ్, తేజస్, సారంగం, హెలికాప్టర్లు, బోయింగ్, డసాల్ట్ ఏవియేషన్ తదితర విమానాలు, హెలికాప్టర్లతో పాటు డ్రోన్లను కూడా ప్రదర్శించనున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రదర్శనను నిర్వహిస్తూ వస్తున్నారు. గత ప్రదర్శనలో దేశ విదేశాలకు చెందిన 809 లోహ విహంగాలు ప్రదర్శనకు నగరానికి తీసుకువచ్చారు.

దర్శన్ బెయిల్‌పై విచారణ వాయిదా

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితులు నటి పవిత్రా గౌడ, నటుడు దర్శన్, ఇతర నిందితులు అనుకుమార్, రాఘవేంద్ర, దీపక్, పవన్ బెయిలు కోసం వేసుకున్న అర్జీల విచారణ అక్టోబరు 8కి వాయిదా పడింది. దర్శన్ తరఫున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్ వాదనలు వినిపించగా, ఇతర నిందితుల తరఫున టామి సెబాస్టియన్ వాదించారు. దర్శన్‌ను ఈ కేసులో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని, ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సృష్టించారని నాగేశ్ వాదించారు. అభియోగపత్రంలోనూ పలు లోపాలు ఉన్నాయని తెలిపారు. నిందితుల నుంచి జప్తు చేసుకున్న కొన్ని చరవాణుల నుంచి వీడియో, ఫోన్ చాట్‌లను ఎవరు తొలగించారో ఇప్పటి వరకు గుర్తించి, వాటిని రిట్రీవ్ చేయించలేదని చెప్పారు. పట్టణగెరె షెడ్డు నుంచి సేకరించిన మన్నుకు, దర్శన్ బూట్ల కింద మట్టికి పొంతన లేదన్నారు. దర్శన్ చెప్పులు వేసుకున్నానని చెప్పగా, పోలీసులు బూట్లు ధరించి ఉన్నాడని అభియోగపత్రంలో పేర్కొన్నారని చెప్పారు. కొన్ని చరవాణులను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించలేదన్నారు. వాదనలు ఆలకించిన న్యాయమూర్తి జైశంకర్ తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రూ.5 కోట్ల విలువైన పాతనోట్లు ధ్వంసం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: వివిధ నేరాలకు సంబంధించి నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.5 కోట్ల విలువైన పాత నోట్లను ఆర్‌బీఐ స్వీకరించేందుకు సిద్ధంగా లేకపోవడంతో వాటిని కాల్చేందుకు నగర పోలీసులు సిద్ధమవుతున్నారు. అందుకోసం న్యాయస్థానం అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. నిషేధించిన రూ.500, రూ.1000 నోట్లకు ప్రస్తుతం నయా పైసా విలువ లేదు. ఆ నోట్లను మార్చేందుకు నగర పోలీసులు, ఆర్‌బీఐ అధికారులను సంప్రదించారు. మార్చేందుకు అనుమతించాలని కోరగా అందుకు ఆర్‌బీఐ అధికారులు తిరస్కరించారు. నోట్ల మార్పిడి గడువు పూర్తయినందు వల్ల ఇప్పుడు అందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. దీంతో ఆ నోట్లను కాల్చేందుకు తీర్మానించారు. న్యాయస్థానం అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.


చిరుత చిక్కింది




బోనులో చిరుత

మైసూరు, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులు, ప్రాణులపై దాడి చేసి తీసుకువెళుతూ స్థానికులకు కంటిమీద కునుకే లేకుండా చేసిన చిరుత ఒకటి అటవీ శాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన బోనులో పడింది. స్థానికులు ఫిర్యాదుతో హెచ్‌డీ కోటె శివారు ప్రాంతం హౌసింగ్ బోర్డు పరిధిలో బోనులు ఏర్పాటు చేశారు. బోనులో ఉన్న జాగిలాన్ని తినేందుకు వచ్చి అది దొరికిపోయింది. తప్పించుకునేందుకు ప్రయత్నించిన సమయంలో చిరుత తలకు గాయాలయ్యాయి. చిరుతను అక్కడి నుంచి నాగరహొళె అటవీ విభాగానికి అధికారులు తీసుకువెళ్లారు.

శాకంబరి.. సర్వశుభకరి





పరమ మంగళాదేవి అలంకారంలో శాకంబరిమాత

ఆదిశక్తి..అందరి ఆరాధ్యదైవం బనశంకరీ మాత, శాకంబరీ దేవి దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా వైవిధ్యమైన అలంకారాలతో తమ దర్శనభాగ్యాన్ని భక్తకోటికి కలిగిస్తున్నారు. అమ్మ దర్శనంతో భక్తులు పరమానందభరితులవుతున్నారు. ఆదివారం బెంగళూరులోని బనశంకరి, పరమ మంగళాదేవి పండ్లతో, శాకంబరి రూపాల్లో కొలువుదీరారు. **- న్యూస్‌టుడే, బెంగళూరు(సాంస్కృతికం)**



అందరి లక్ష్యం.. సేవా మార్గం

స్వచ్ఛంద సేవాసంస్థల సహాయార్థం విప్రో బెంగళూరు ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. **వివరాలు 10లో**

- న్యూస్‌టుడే, బెంగళూరు క్రీడలు

నేనెవరో మీకు తెలుసా?

రామనగర: చెన్నపట్టణ తాలూకా చక్కెర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖాముఖి అయ్యారు. 'బాలలూ, నేనెవరో మీకు తెలుసా?' అని వారిని ప్రశ్నించారు. 'ఉప ముఖ్యమంత్రి' అంటూ విద్యార్థులు ఏక కంఠంతో చెప్పారు. కొత్తగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. రామనగర జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను వృద్ధి చేసేందుకు ప్రైవేటు సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నామని చెప్పారు.



బాలలతో మాట్లాడుతున్న శివకుమార్

'నేను టాటా చెప్పి వెళ్లిపోను'



వేదికపై కుమారస్వామి, నిఖిల్

రామనగర, న్యూస్‌టుడే: నేను టాటా చెప్పి వెళ్లిపోయే నాయకుడిని కాదంటూ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్‌లను ఉద్దేశించి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. చెన్నపట్టణలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో తన కుమారుడు నిఖిల్‌తో కలిసి మాట్లాడారు. చెన్నపట్టణ నుంచి తనను పలుసార్లు గెలిపించిన ఓటర్లకు తాను ఎప్పుడూ రుణపడే ఉంటానని చెప్పారు. ఎన్నికలు ముగిసినా, ఇప్పటికీ తన కుమారుడు నిఖిల్ ఓటర్ల మధ్యలో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. మండ్య, రామనగర, హాసన, మైసూరు జిల్లాల్లో మొదటి నుంచి దళ్‌కు ఉన్న పట్టును కోల్పోయేందుకు సిద్ధంగా లేమన్నారు. త్వరలో ఉప ఎన్నికల తేదీలను ప్రకటిస్తారని, ఆ లోగా ఇక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థిని భాజపాతో కలిసి ప్రకటిస్తామని చెప్పారు. ఎన్నికలు ఉన్నాయని వచ్చి వెళ్లే వారు ఎవరో, ఎప్పటికీ మీతో కలిసి ఉండే వారు ఎవరో తెలుసుకోవాలని ఓటర్లను కోరారు.

'విపక్షాలను దూషించడం మీకే చెల్లింది'

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ముడాలో అక్రమంగా ఇళ్ల స్థలాలను పొందిన మీ భార్య విషయంలో విచారణ జరుగుతుంటే ఆ నేరాన్ని విపక్షాలపై తోసివేయడం సరికాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హితవు పలికారు. మీ భార్యను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు ఆరోపణలు చేయడం లేదని గుర్తు చేశారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ 15 నెలల పాలనకు, తన 14 నెలల పాలనకు సంబంధించి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మీరు బహిరంగ చర్చలో పాల్గొనేందుకు సిద్ధమా అని సిద్ధరామయ్యకు సవాలు విసిరారు. 'ప్రభుత్వాన్ని గాని, మిమ్మల్నిగాని చూసి ఎవరూ భయపడడం లేదు. మీరంటే నాకెందుకు భయం. మాజీ ప్రధాని దేవేగౌడ ఇచ్చిన అవకాశాలతోనే మీరు రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మీ భార్యను ఇళ్ల స్థలాల విషయంలోకి మీరే లాక్కొని వచ్చి, ఇప్పుడు విపక్షాలు తప్పు పడుతూ వ్యాఖ్యలు చేయడం సరికాదు' అన్నారు. మీకు సమస్య వచ్చినప్పుడల్లా ప్రతిసారీ అహిందా తనవెంటే ఉందని అని మాట్లాడడం తగదన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలతో మీ ప్రభుత్వానికి అహింద ఎప్పుడో దూరం అయ్యిందన్నారు. అహిందకు మీ ప్రభుత్వం ఇచ్చిన గౌరవం, జారీ చేసిన పథకాలు ఏమున్నాయని ప్రశ్నించారు. మీ భావోద్వేగాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే ప్రయోజనం లేదన్నారు. రాజకీయ నాయకులు చేసే తప్పులైనా, అభివృద్ధి పనులైనా ప్రజలు ఆమోదిస్తారా లేదా అని తెలుసుకునేందుకు ఎప్పుడైనా కొంత సమయం వేచి ఉండవలసి వస్తుందన్నారు. బెంగళూరులో భారీ వర్షం కురిస్తే ప్రజా జీవితం అస్తవ్యస్తం అవుతుందని, ముందు ఆ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

రాజకీయం.. కక్షపూరితం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: కర్ణాటకలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ముడా నుంచి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి అక్రమంగా 14 ఇంటి స్థలాలను పొందారని, ఆయన పదవికి రాజీనామా చేసి, విచారణకు హాజరు కావాలంటూ భాజపా, దళ్ డిమాండ్ చేశాయి. బెంగళూరు నుంచి మైసూరు వరకు పది రోజులపాటు పాదయాత్ర చేసి హడావుడి చేశాయి. మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ముడా నుంచి భూములు తీసుకున్నారని, డీనోటిఫికేషన్‌కు సంబంధించి లోకాయుక్త ముందు కేసులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కుమారస్వామి సైతం తన పదవికి రాజీనామా చేసి విచారణకు హాజరు కావాలంటూ కాంగ్రెస్ ఆందోళనకు దిగడంతో ఆయన తన స్వరాన్ని మార్చారు. సిద్ధరామయ్యను రాజీనామా చేయాలని తాను ఎన్నడూ డిమాండ్ చేయలేదని, విచారణను ఎదుర్కోవాలని మాత్రమే సూచించానని చెప్పేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. రాష్ట్ర భాజపాతో కొద్ది రోజులుగా సమావేశాల్లో పాల్గొంటూ వచ్చిన కుమార ప్రస్తుతం ఇక్కడి నేతలకు దూరంగా ఉంటున్నారు. అధిష్ఠానం అండగా ఉండడంతో సిద్ధరామయ్య ధీమాతో పాలన కొనసాగిస్తున్నారు. ఆయనే ఐదేళ్లపాటు సీఎంగా కొనసాగుతారని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ప్రకటించారు. మంత్రులు ఎంబీ పాటిల్, జమీర్ అహ్మద్ ఖాన్ వంత పలికారు.

సీఎం మార్పు అంటూ..

ముఖ్యమంత్రి మారే అవకాశం ఉందన్న నమ్మకంతో మంత్రులు పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళి తదితరులు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయి వచ్చారు. దళిత ముఖ్యమంత్రికి అవకాశం వస్తుందని కొద్ది రోజులుగా ప్రచారం జరిగింది. ఇవేమీ తనకు సంబంధించిన అంశం కాదన్నట్లు సిద్ధరామయ్య మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించారు. వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారు. సిద్ధరామయ్యతో పాటు మంత్రులు జమీర్ అహ్మద్ ఖాన్, భైరతి సురేశ్, రాజణ్ణ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. వారిపైనా కేసులు వేసేందుకు సహ కార్యకర్తలు, భాజపా నాయకులు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరోవైపు శాంతినగర ఎమ్మెల్యే ఎన్ఏ హ్యారిస్ ఎన్నికల ప్రమాణ పత్రంలో తప్పుడు వివరాలు నమోదు చేశారని ఆయనపై ఓడిపోయిన భాజపా అభ్యర్థి సుప్రీంకోర్టులో కేసు వేశారు. హైకోర్టులోనే సమస్యను పరిష్కరించుకోవాలని సూచించడంతో దర్యాప్తు మళ్లీ ఇక్కడకే వచ్చింది. ఈ నెల 8న కేసు విచారణకు రానుంది. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ఎలాంటి తప్పు చేయలేదంటూ దళ్ నేత, మాజీ మంత్రి జీటీ దేవేగౌడ వ్యాఖ్యలు చేయడంతో ఆ పార్టీ నేతలు కంగుతిన్నారు.



దళ్ దారెటు?

సిద్ధరామయ్య అంశం కన్నా దళ్ నేతలు ఇప్పుడు ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్, తమ పార్టీ పూర్వనేత, భూ వ్యాపారి విజయ్ టాటాపై ఆరోపణలు చేసి, వారిపై పోరు ప్రకటించింది. హరియాణా, జమ్మూ కశ్మీరు ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని తన ప్రసంగాల్లో పేర్కొన్న ప్రధాని మోదీ, మళ్లీ ఇప్పుడు దానిపై నోరు మెదపలేదు. కర్ణాటకలో మూడు చోట్ల ఉప ఎన్నికల తేదీలను త్వరలో ప్రకటించనున్నారు. ఈ సమయంలో ఆరోపణలు చేస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందని కాషాయ పార్టీ నేతలు యోచిస్తున్నారు. చెన్నపట్టణ నుంచి నిఖిల్ పోటీ చేస్తారని ఇప్పటికే పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీ చేస్తానని మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ ప్రకటించారు. ఈ విషయంలోనూ కాషాయ పార్టీతో దళ్ నేతలకు దూరం పెరిగే అవకాశం ఉంది.

పార్టీల్లో కేసుల గుబులు

హైకోర్టు ఆదేశాలతో మైసూరు లోకాయుక్తలో ముఖ్యమంత్రి, ఆయన భార్య, బావమరిది, వారికి స్థలం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదైంది. అక్రమాలకు సంబంధించి లోకాయుక్త అధికారులు ఆదివారం కూడా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఏవైనా ఆధారాలు దొరికితేనే ముఖ్యమంత్రిని విచారణకు హాజరు కావాలని పిలిచే అవకాశం ఉంది. ముందుగా స్థలం విక్రయించిన వ్యక్తిని, సిద్ధరామయ్య బావమరిదిని విచారణకు పిలిచే అవకాశం ఉంది. విజయదశమి పూర్తయ్యేలోగా విచారణకు పిలుస్తారని భాజపా ధీమాతో ఉంది. ఉప ఎన్నికల తేదీలను ప్రకటించిన అనంతరం విచారణకు పిలిస్తే కేంద్రం కక్ష సాధింపులకు దిగిందని అధికార పార్టీ ఆరోపిస్తుందన్న అనుమానం కాషాయ పార్టీ నేతల్లో గుబులు మొదలైంది. మరో వైపు భాజపాలో రెండో శక్తికేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రమేశ్ జార్కిహొళి, యత్నాళ్, అరవింద లింబావళి తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారు. విజయేంద్ర తమకు నాయకుడే కాదనన్నట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బహిరంగ ప్రకటనలతో దుయ్యబట్టారు. ఆపరేషన్ కమలకు రూ.వెయ్యి కోట్లు సిద్ధం చేసుకున్నారని విజయేంద్రపై యత్నాళ్ ఆరోపణలు గుప్పించారు. విపక్ష నేత అశోక్ డీనోటిపై చేసిన భూమి కొనుగోలు చేశారని అధికార పార్టీ ఆరోపించింది. అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటూ కారాగారం చేరిన మునిరత్నను ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. రాజీనామా చేయాలని అంటున్న నేతల్లో ఎక్కువ మంది బెయిలుపై ఉన్నారని గాలి జనార్దన రెడ్డి, యడియూరప్ప తదితరులను ఉద్దేశించి మంత్రి బంగారప్ప వ్యాఖ్యలు చేశారు. విజయదశమి పూర్తయ్యేలోగా కర్ణాటక రాజకీయం మరింత నాటకీయంగా మారుతుందని రాజకీయ విశ్లేషకుల మదింపు.




కవాతు చేస్తున్న కార్యకర్తలు


కార్యకర్తల పథ సంచలనం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: శరన్నవరాత్రులను పురస్కరించుకుని హెబ్బాళ విభాగం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నాగవార ప్రాంతంలో ఆదివారం కవాతు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ 1925 ఏడాది విజయదశమి సందర్భంలో ఏర్పాటైంది. అప్పటి నుంచి పండగ సమయంలో గణవేషధారణలో కవాతు చేస్తూ వస్తున్నామని సంఘపరివార్ నాయకులు తెలిపారు. నాగవార మైదానంలో ప్రార్థన అనంతరం 500మందికి పైగా కార్యకర్తలు పథసంచనలంలో పాల్గొన్నారు. దారి మధ్యలో హిందూ సంఘాల ప్రతినిధులు, భాజపా కార్యకర్తలు వారిపై పూలరేకులు చల్లి స్వాగతించారు.


బళ్లారి: అన్నపూర్ణదేవిగా రేణుక ఎల్లమ్మ


బళ్లారి: విశేషాలంకారంలో బెంకి మారెమ్మ


హొసపేటె: బాణదకేరి హులిగెమ్మ తల్లి


హొసపేటె: మ్యాసకేరిలో కొంగమ్మ


బళ్లారి గ్రామీణ: కూష్మాండదేవిగా..


బళ్లారి గ్రామీణ: శాకంబరిగా తుల్జాభవాని


బళ్లారి గ్రామీణ: దుర్గాదేవికి చంద్రగంట అలంకారం

లలితాంబ నమోస్తుతే

వేడుకగా శరన్నవ రాత్రులు


బళ్లారి: వరాహ అలంకారంలో శ్రీవాసవీమాత


సింధనూరు: సామూహిక లలితాసహస్రనామ పఠనం

బళ్లారి, విజయనగర జిల్లాల్లోని అమ్మవారి ఆలయాలు దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం భక్తులతో కళ కళలాడాయి. అమ్మవారు లలితాంబగా దర్శనం ఇచ్చారు. బళ్లారి నగరం, గ్రామీణం, హొసపేటె, కంప్లి, కారటగి, సింధనూరు, శ్రీరామనగర్, గంగావతి, సిరుగుప్ప తదితర ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు లలితాసహస్రనామ స్తోత్రాలు పఠించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంచారు. –న్యూస్‌టుడే బృందం


బళ్లారి గ్రామీణ: పూజలో పాల్గొన్న భక్తులు


చెళ్లకెర: చెళ్లకెరమ్మ అమ్మవారు


సిరుగుప్ప: అంబాభవాని ఆలయంలో..


సిరుగుప్ప: శ్రీనగర్ క్యాంపులో లలితాంబగా...


కారటగి: రత్నగిరిపై లలితాత్రిపురసుందరిగా..


శ్రీరామనగర్‌లో కనకదుర్గమ్మ


కంప్లి: గౌసముద్ర మారెమ్మ తల్లి

ముమ్తాజ్ అలి అదృశ్యం


ముమ్తాజ్ అలి దూకిన ఫల్గుణి నదిలో గాలింపు చర్యలు

మంగళూరు, న్యూస్‌టుడే: మంగళూరు నగర మాజీ ఎమ్మెల్యే మొయినుద్దీన్ బావా సోదరుడు బీఎం ముమ్తాజ్ అలి (52) ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయారు. ముస్లిం నాయకునిగా, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షునిగా ఆయనకు చక్కని గుర్తింపు ఉంది. ఆయన విలాసవంతమైన కారు కోళూరు వంతెన వద్ద కనిపించింది. ఫల్గుణి నదిలోకి దూకి ఉంటారన్న అనుమానంతో జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం, తీరప్రాంత రక్షణ దళం, స్థానిక మత్స్యకారులు, అగ్నిమాపక దళ సిబ్బంది నదిలో గాలింపు చేపట్టారు. గజ ఈతగాడు ఈశ్వర్ మల్పే నాలుగు గంటలపాటు నదిలో గాలించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు.

సేవకు సై!!


ఫుల్‌మారథాన్ మహిళా విజేతలుకు సత్కారం


పతకాలు పొందిన పదికిలోమీటర్ల పరుగు విజేతలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థల సహాయార్థం ఆదివారం కంఠీరవ స్టేడియంలో జరిగిన విప్రో బెంగళూరు మారథాన్ పరుగు కార్యక్రమంలో 30 వేలమంది ఔత్సాహికులు పాల్గొని తమ ప్రతిభా సామర్థ్యాలను నిరూపించుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలను పరుగు పోటీల రాయబారి, మాజీ అంతర్జాతీయ క్రీడాకారిణి రీత్‌అబ్రహం, రేస్ డైరెక్టర్ నాగరాజ్ ప్రారంభించగా పది కిలోమీటర్ల హాఫ్ మారథాన్ పరుగుకు పద్మశ్రీ పుల్లెల గోపిచంద్, ఎంపీ తేజస్వీసూర్య, ట్రాఫిక్ అదనపు కమిషనర్ రాజేందర్‌కుమార్ కటారియా, కె.గోవిందరాజు పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపిచంద్ మాట్లాడుతూ ఫిట్‌నెస్, ఆరోగ్యంతో పాటు సమాజసేవ కోసం ఏర్పాటు చేసిన ఈ పరుగులో పాల్గొనడం అద్భుతంగా ఉందని తెలిపారు. శ్రీరామ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ ఛైర్మన్ మురళీ మలయప్పన్ మాట్లాడుతూ బెంగళూరు మారథాన్‌కు చక్కని స్పందన లభించిందన్నారు. ఐదు కిలోమీటర్ల రేస్‌లో ఎన్జీవోలు కార్పొరేట్‌లు, సీనియర్ సిటిజన్లు, ఔత్సాహికులు పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌లో పురుషుల విభాగంలో ఆర్మీకి చెందిన కార్తీక్‌కుమార్, ప్రదీప్ సింగ్ చౌదరి, రైల్వేస్‌కు చెందిన హర్షద్ వరుసగా బంగారు, రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. మహిళల విభాగంలో రైల్వేస్‌కు చెందిన కె.ఎల్.లక్ష్మీ, అశ్వీనీమదన్‌జాదవ్, జ్యోతిశంకరావుగవాటే దక్కించుకున్నారు. హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో అశోక్‌బిందే, నంజుడప్ప, బుగేలేకుమార్, 10 కిలోమీటర్ల రేస్ పురుషుల విభాగంలో అవిక్‌భట్టాచార్య, విజయ్‌కుమార్, శివానంద పతకాలు గెలిచారు. మహిళల విభాగంలో భారతి, కియోకోహష్మిమటో, వైభవి తొలి మూడు స్థానాలతో బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు.

జాగిలాల నాజూకు 'షో'కు


మైసూరు, న్యూస్‌టుడే: మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా జీకే మైదానంలో ఆదివారం నిర్వహించిన జాగిలాల ప్రదర్శనకు ప్రాణిప్రియుల నుంచి చక్కని స్పందన లభించింది. దేశ విదేశీ జాతుల జాగిలాలను వాటి యజమానులు పోటీకి తీసుకువచ్చారు. జర్మన్ షెఫర్డ్, టిబెటియన్ మస్టిఫ్, ఇండియన్ మస్టిఫ్, డాబర్ మ్యాన్, ముధోళ్, సైబీరియన్ హస్కి, ఐషిర్ శెట్టర్, అటికా, ల్యాబ్రడార్, పూడ్లే, డాగో అర్జెంటీనా, గ్రేట్ డేన్, పమేరియన్, రాజ పల్యమ్, పిట్‌బుల్, గోల్డెన్ రిట్రీవర్, కాకర్ స్పానియల్, అమెరికన్ బుల్లీ, బాక్సర్, బీగల్, ఫ్రెంచ్‌బుల్ డాగ్, చౌచౌ, పగ్, డచ్ షెఫర్డ్, టిబెటియన్ స్పానియల్, రాట్‌విల్లర్, సెయింట్ బెర్నాడ్ తదితర 45 జాతులకు చెందిన 480 జాగిలాలు పోటీ పడ్డాయి. గత ఏడాది దసరాలో కేవలం 20 జాతుల జాగిలాలు పోటీ పడ్డాయి. మనదేశంలోనూ పెంపుడు జంతువులను పెంచుకునే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని రాజ్యసభ సభ్యురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తి తెలిపారు. వీధుల్లో గాయపడి, జబ్బుపడిన జాగిలాలను రక్షించి, వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రాణిప్రియులు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. పోటీకి సుధామూర్తి తీసుకువచ్చిన పెంపుడు జాగిలం గోపి కూడా బహుమతి గెల్చుకుంది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ జాగిలాలకు వేర్వేరు విభాగాల్లో బహుమతులు ప్రదానం చేశారు.


తమ పెంపుడు శునకాలను ప్రదర్శిస్తున్న యువతులు

అరేబియా దరి..

పర్యాటక ఝరి

- అందాలతో కట్టిపడేస్తున్న నేత్రాణి దీవి
- ఈ సెలవుల్లో సరదాగా చుట్టేద్దాం


హృదయ ఆకారంలో ఉన్న నేత్రాణి దీవి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: కర్ణాటక కోస్తా తీరంలోని అరేబియా సముద్రంలో అద్భుతమైన పర్యాటక కేంద్రాలను మైసూరు దసరా ఉత్సవాలను హాజరవుతున్న స్వదేశీ విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. మాలె దీవులను తలపించేలా ఉన్న ప్రదేశాలను పర్యాటకులు తిలకించేందుకు ప్రత్యేక పడవ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ముడేశ్వర సమీపంలోని 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేత్రాణి దీవి పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. అక్కడున్న స్కూబా డైవింగ్ చేసేందుకు యువత మక్కువ చూపుతున్నారు. హృదయ ఆకారంలో ఈ దీవి ఉండటంతో పాటు అక్కడ ఏపుగా పెరిగిన చెట్లు వాటిల్లో సంచరించే వన్యజీవులు, ప్రాచీన హనుమంతుడి దేవస్థానం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అక్కడికి పడవలో వెళ్లాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడవలు సంచరిస్తాయి. రాత్రిళ్లు దీవిలో ఉండేందుకు అవకాశం లేదు. సముద్రం నీటిలో మునిగేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. గోవా తరువాత స్కూబా డైవింగ్ నేత్రాణి దీవి వద్ద ఉంది. పర్యాటకులు దీవిలో సంచరించేందుకు ఇష్టపడుతున్నారు. రక్షణ కవచాలతో పాటు ఆక్సిజన్ సిలిండర్ ధరించి సముద్రం లోపల విహరించేందుకు అవకాశం ఉంది. సముద్రం లోపు వివిధ రకాల చేపలు, నత్తలు, తాబేళ్లు, వృక్షాలు తదితర వాటిని తిలకించవచ్చు. ఈతలో ప్రావీణ్యత సాధించిన వ్యక్తులకు మాత్రమే సముద్రం లోపల వెళ్లేందుకు అనుమతిస్తారు. లోపలకు వెళ్లి వారిపై నిఘా వేసేందుకు గజఈతగాళ్లు వెంట ఉంటారు. సముద్రం లోపల అందమైన దృశ్యాలను తిలకించవచ్చు. ఇందు కోసం యువత దీవిని సందర్శించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దసరా, దీపావళి సెలవు రోజుల్లో పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. నేత్రాణి దీవికి వెళ్లేందుకు ముందస్తుగా స్థానిక అధికారులు అనుమతులు తప్పనిసరిగా ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు ఇప్పటికే ఆరువేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.


తాబేళ్లు సంచారం


దీవికి పడవల్లో ప్రయాణించాలి


దీవి సమీపంలో సముద్రంలో మునుగుతున్న పర్యాటకులు


వివిధ జాతుల చేపలు

కలరాగా ధ్రువీకరించిన వైద్యులు

ఉడుపి, న్యూస్‌టుడే: దక్షిణ కన్నడ జిల్లాలో ఉప్పుంద, దానికి సమీపంలోని ఉడుపి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో కలరా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. ఇప్పటికే ఆయా ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిలో 800 మంది ఇళ్లకు తిరిగి వచ్చారు. మరో 200 మందికి ఆసుపత్రుల్లో చికిత్స కొనసాగుతోంది. కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన బాధితులను తహసీల్దారు ప్రదీప్ పరామర్శించారు. పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీల అధికారులకు సూచించారు.

పొడుస్తానని బెదిరింపు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: అత్తిబెలె నుంచి మెజెస్టిక్ మధ్య సంచరించే బస్సులో గురువారం రాత్రి ప్రయాణించిన వ్యక్తి ఒకరు డ్రైవరు, కండెక్టర్‌లను స్క్రూడ్రైవర్‌తో పొడుస్తానని బెదిరించాడు. కోనప్పనఅగ్రహార వద్ద బస్సును నిలపకపోవడంతో తన సంచి నుంచి స్క్రూడ్రైవరు తీసి బెదిరించాడు. ప్రయాణికులు ఈ ఘటనను మొబైల్‌లో ఫొటో తీసుకున్నారు. డ్రైవరు భయంతో బస్సు నిలపగా అతను దిగి వెళ్లిపోయాడు. బీఎంటీసీ సిబ్బంది ఫిర్యాదుతో మడివాళ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రూ.3వేల కోట్లతో 4 వరుసల రైల్వే మార్గం

బళ్లారి, న్యూస్‌టుడే: 'కల్యాణ కర్ణాటక పరిధిలోని బళ్లారి, హొసపేటె రైల్వేస్టేషన్ల పరిధిలో వివిధ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. రెండు స్టేషన్లలో అభివృద్ధి పనులకు మొత్తం రూ.6200 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నాం. బళ్లారి-హొసపేటె మధ్యలో నాలుగు వరుసల డబ్లింగ్ లైన్ల పనులకు సంబంధించిన నివేదిక పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభిస్తామని' కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమణ్ణ తెలిపారు. బళ్లారి నగర పర్యటనలో భాగంగా ఆయన జిల్లా నూతన సంకీర్ణ భవనంలో ఏర్పాటు చేసిన ప్రగతి సమీక్షలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. బళ్లారి-చిక్కజాజూర్ రైల్వే మార్గం 185 కి.మీ.డబ్లింగ్ లైన్ కోసం రూ.3080 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో ఈ పనులు పూర్తవుతాయన్నారు. స్వామిహళ్లి-రాయదుర్గం మార్గంలో 52 కి.మీ. పనులకు సాంకేతిక పరిశీలన పూర్తయిందని, డీపీఆర్ కాగానే ప్రారంభిస్తామన్నారు. బళ్లారి-హొసపేటె మధ్య నాలుగు వరుసల డబ్లింగ్ లైన్ పనులకు రూ3 వేల కోట్లు కేటాయించామని, డీపీఆర్ సిద్ధమైందని చెప్పారు. వ్యాసనకెరె-అమరావతి కాలనీ మార్గంలో 20 కి.మీ., తోరణగల్లు-రంజిత్‌పూర్ 29 కి.మీ.ల డబ్లింగ్ లైన్ పనులు చేస్తున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సోమణ్ణ పక్కన ఎంపీ తుకారామ్

అమృత్‌భారత్ కింద రైల్వేస్టేషన్..

అమృత్‌భారత్ కింద బళ్లారి రైల్వేస్టేషన్ కోసం రూ.16.66 కోట్లు, హొసపేటె రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.15.17 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి సోమణ్ణ తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 21 రైల్వే ప్రాజెక్టులు పనులు జరుగుతున్నాయని, ఇందుకోసం రూ.43 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో 24 రాష్ట్రాల్లోని 303 జిల్లాలో 103 వందే భారత్ రైళ్లు తిరుగుతున్నట్లు చెప్పారు. ఒక్క కర్ణాటకలోనే పది వందేభారత్ రైళ్లు తిరుగుతున్నట్లు తెలిపారు. పేదలు, సామాన్యులకు తక్కువ ఛార్జీలతో వాటిని అందుబాటులోకి తెచ్చారన్నారు. త్వరలో వందేభారత్ స్లీపర్ కోచ్‌లు వస్తాయని తెలిపారు. పదేళ్లలో 49 వేల కి.మీ. డబ్లింగ్ లైన్లు పూర్తిచేశామని, 98 శాతం రైల్వే లైన్లు విద్యుదీకరణ జరిగిందని వివరించారు.

జిల్లా రైల్వే పనులపై వాడీవేడి చర్చ

బళ్లారి జిల్లా, నగరంలో పలు రైల్వే పనులపై సమావేశంలో వాడీవేడిగా చర్చ జరిగింది. బళ్లారి నగర నడిబొడ్డున దుర్గమ్మ దేవస్థానం ముందు వంతెన, హెచ్.ఆర్.గవియప్ప కూడలి వద్ద రైల్వే వంతెన విస్తరణ, రెండో రైల్వే గేటు వద్ద పైవంతెన పనులు చేయించాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఇ.తుకారామ్ కుడతిని-కురుగోడు రైల్వేలైన్‌లో నిర్మిస్తున్న పైవంతెన తదితర పనులను మంత్రికి వివరించారు. మేయర్ ముల్లంగి నందీష్, జడ్పీ సీఈవో రాహుల్, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, రైల్వే అధికారులు అజయ్‌శర్మ, హుబ్బళ్లి డీఆర్ఎం హర్ష్‌ఖారె, డీఎఫ్‌వో నందీష్ సూర్యవంశీ, ఏడీసీ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన రైల్వే, రెవెన్యూ అధికారులు

పిడుగుపాటుకు ఇద్దరు రైతుల బలి


బణకార్ నారప్ప, బణకార్ ప్రశాంత్ మృతదేహాలు

హొసపేటె, న్యూస్‌టుడే: పొలం పనులు చేస్తున్న బణకార్ నారప్ప(58), బణకార్ ప్రశాంత్(40) అనే రైతులు పిడుగుపాటుకు ప్రాణాలు వదిలిన ఘటన ఆదివారం హగరిబొమ్మనహళ్లి దశమాపురలో జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన రైతులు మొక్కజొన్న పొలంలో పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. తల దాచుకోవటానికి ఓ చెట్టు కిందకు వెళ్లగా పిడుగుపడి ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. పెద్దలను కోల్పోయిన ఆ రెండు కుటుంబాల్లో రోదనలు మిన్నంటాయి. హగరిబొమ్మహళ్లి తహసీల్దార్ కవిత, పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: మొళకాల్మూరు తాలూకా మర్లహళ్లి భంగేరహట్టి గ్రామానికి చెందిన అశోక సూరయ్య (30) అనే యువకుడు గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక సూరయ్య కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. మద్యపానం వద్దని కుటుంబ సభ్యులు గట్టిగా ఒత్తిడి చేయడంతో తట్టుకోలేక బలవన్మరణం పొందాడు. మొళకాల్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హత్య చేసిన భార్య

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త రాఘవేంద్ర(35)ను హత్య చేసిన భార్య దివ్య జైలుపాలైన ఘటన తాలూకాలోని యాదలగట్ట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదలగట్టలో రాఘవేంద్ర, దివ్య దంపతులు దుకాణం పెట్టుకొని జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రాజణ్ణతో దివ్యకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇద్దరూ కలిపి పథకం పన్ని రాఘవేంద్రకు నిద్రమాత్రలు మింగించారు. ఆయన గాఢ నిద్రలో ఉండగా గొంతుకు తాడుతో బిగించి హత్య చేశారు. బంధువులకు కడుపునొప్పితో చనిపోయినట్లు చెప్పారు. అనుమానంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం పంపారు. శవపరీక్ష నివేదికలో రాఘవేంద్ర మృతి అసహజమని తేలడంతో పోలీసులు దివ్యను అదుపులోనికి తీసుకొని విచారించగా హత్య బయటపడింది. నిందితురాలికి సహకరించారన్న ఆరోపణలతో రాజణ్ణ, దివ్య చిన్నాన్న మారణ్ణనూ పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాలువలో మృతదేహం లభ్యం

హొసపేటె, న్యూస్‌టుడే: కాలువలో చేతులు, కాళ్లు కడుక్కుంటూ ఆకస్మికంగా పడి కొట్టుకుపోయిన సణ్ణ నింగప్ప(53) మృతదేహం ఆదివారం కమలాపుర సమీపంలోని పవర్ కెనాల్‌లో లభ్యమైందని పోలీసులు తెలిపారు. హొసపేటె పట్టణం చెప్పరదహళ్లికి చెందిన ఆటోవాలా సణ్ణనింగప్ప 3న అత్తగారికి తద్దినం పెట్టారు. భార్యతో కలిసి రైల్వేస్టేషన్ మార్గంలోని ఎల్లెల్సీలో కాళ్లూచేతులు కడుక్కుంటుండగా జారిపడి కొట్టుకుపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హొసపేటె గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కూలీ మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కాలువలో పడిన కృష్ణ అనే కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం హొసపేటెలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సున్నపుబట్టి వీధిలో ఉంటున్న కృష్ణ(38) అనే కూలి తాగుడుకు అలవాటు పడ్డాడు. శనివారం రాత్రి తాగిన మత్తులో బహిర్భూమికి వెళ్లి కాలువలో పడ్డాడు. విషయం తెలియని కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెతికారు. ఉదయం కమలాపుర కాలువ వద్ద ఆయన మృతదేహం లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కమలాపుర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కల్మఠంలో ఘనంగా ఒడినింపే కార్యక్రమం



మహిళ ఒడినింపుతున్న ముత్తైదువు

మాన్వి, న్యూస్‌టుడే : శరన్నవరాత్రుల్లో భాగంగా కల్మఠంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజూ కల్మఠంలో దేవీపురాణాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మహిళల ఒడినింపే కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా జరిపారు. కల్మఠ మహిళా భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

బాధితుడికి మంత్రి పరామర్శ

గంగావతి, న్యూస్‌టుడే: తాలూకాలోని డణాపుర గ్రామంలో ఇల్లు కూలి గాయపడిన ప్రకాశ్ అనే వ్యక్తిని జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడిగి ఆదివారం పరామర్శించారు. క్షతగాత్రుడు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయనకు రూ.1.20 లక్షతో ఇల్లు నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు. చికిత్స కోసం పరిహారాన్ని జిల్లా యంత్రాగం పంపిణీ చేస్తుందన్నారు. తాను వ్యక్తిగత సాయం చేస్తానన్నారు. వడ్డరహట్టికి చెందిన గడ్డి భీమప్ప అనే వ్యక్తి క్షతగాత్రుడికి రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస్, ఫకీరయ్య, భీరప్ప, అయ్యప్ప పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్నదానం



అన్నసంతర్పణ చేస్తున్న ఆల్దాళ వీరభద్రప్పగౌడ

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటన విజయవంతమైంది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం కనిపిస్తుంది. యువ కాంగ్రెస్ నాయకుడు రవిబోసురాజు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించడమేనని ఇందుకు కారణమని చెప్పవచ్చు. సీఎం సభలో ముఖ్య మట్టం భోజన వ్యవస్థ. సీఎం సభకు 50 వేల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. సభకు వచ్చిన ప్రజలు భోజనం చేసేందుకు ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు. వచ్చిన వారికి భోజన సదుపాయ వ్యవస్థను పట్టణానికి చెందిన ప్రముఖ వర్తకుడు ఆల్దాళ వీరభద్రప్పగౌడ చేపట్టారు. ఆయనే దగ్గరుండి అన్నసంతర్పణ చేశారు. పోలీసులతో సహా ప్రతి ఒక్కరూ భోజనం చేశారు.

తుంగభద్ర కాలుష్య నివారణకు పాదయాత్ర



మాట్లాడుతున్న బసవరాజ్ పాటిల్ వీరాపుర

గంగావతి, న్యూస్‌టుడే: తుంగభద్ర, నేత్రావతి నదుల కాలుష్య నివారణకు శృంగేరి నుంచి కిష్కింధ (గంగావతి) వరకు పాద యాత్ర నిర్వహిస్తున్నట్లు జాతీయ సాంస్కృతిక ఆందోళన్ సంయోజకుడు బసవరాజ్‌పాటిల్ వీరాపుర తెలిపారు. ఆయన ఆదివారం గంగావతిలో విలేకరులతో మాట్లాడారు. నదీ పరివాహక ప్రాంతంలోని పట్టణాలు, పల్లెల నుంచి వచ్చే మురుగు నీరు నేరుగా నదిలోకి చేరుతోందన్నారు. స్థానిక సంస్థలు మురుగునీటిని శుద్ధీకరించి నదిలోకి విడిచేలా చూడాలన్నారు. నదుల కాలుష్యం నివారణకు తమ సంస్థ ఉత్తర భారతంలో చేపట్టిన జన చైతన్య యాత్ర విజయవంతమైందన్నారు. తుంగభద్ర, నేత్రావతి నదుల స్వచ్ఛతను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛీ... 34వ వార్డు

- అభివృద్ధికి ఆమడ దూరం
- ఇద్దరు మేయర్లయినా దుస్థితే

బళ్లారి, న్యూస్‌టుడే: నగరపాలికె పరిధిలోని 34వ వార్డు పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా తయారైంది. ఈ వార్డులో ఎక్కువ మంది ప్రవాసాంధ్రులు ఉన్నారు. బీఎంసీఆర్ ఆసుపత్రి, వైద్య, ఇంజినీరింగ్, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి. ఇంజినీర్లు, వైద్యులు, రైతులు, గుత్తేదారులు, వ్యాపారవేత్తలు జీవనం సాగిస్తున్నారు. 2013, 2020లో జరిగిన రెండు విడతల ఎన్నికల్లో కార్పొరేటర్లుగా గెలిచిన ప్రవాసాంధ్రులు గుర్రం వెంకటరమణ, మోదపల్లి రాజేశ్వరి మేయర్లుగా ఎన్నికయ్యారు. ఇక వార్డు అభివృద్ధి పరుగులు తీస్తుందని భావించినా అనుకున్న స్థాయిలో పనులు జరగలేదని వార్డువాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో రహదారులు లేవు. పలువురు మేయర్లు మారినా భూగర్భ సమస్య తీరలేదు. మదర్ చర్చి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే మార్గంలో ఒక్క రోడ్డుకూ నామ ఫలకాలు కనిపించవు. బత్రి నుంచి శాంతినగర్ మార్గంలో 100 మీటర్ల వరకే సీసీ రోడ్డు వేశారు. మధ్యలో 700 మీటర్లు అలాగే వదిలేశారు. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. మూడు రోజుల క్రితం ఈ మార్గంలో ఓ కారు అదుపుతప్పి కాలువలో పడిపోయిన విషయం తెలిసిందే. కాలువకిరువైపులా గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. కాలనీలకు దూరంగా చెత్తదిబ్బలు వేసుకోవాలని నిబంధనలున్నా.. బత్రిలో కాలువ పక్కన రోడ్డుపైనే గేదెలు కట్టేసి అక్కడే వ్యర్థాలు వేస్తుండడంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. కేసీ కొండయ్య కాలనీలో మొత్తం మూడు ప్రధాన రహదారులు ఉండగా... రెండు, మూడవ రోడ్లకు మాత్రమే మరమ్మతులు చేశారు. ఒకటో ప్రధాన రహదారి దుస్థితికి చేరుకోవడంతో స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీనిపై పలుమార్లు కార్పొరేటర్, మేయర్ దృష్టికి తెచ్చినా ప్రయోజనం శూన్యమని ప్రజలు మండిపడుతున్నారు.



కంకర తేలిన ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే మార్గం



రహదారిపై పడేసిన వ్యర్థాలు



ఇన్నారెడ్డి కాలనీ మొదటి క్రాస్‌లో రోడ్డు దుస్థితి

పేరుకు మాత్రమే మేయర్లు

34వ వార్డు నుంచి కార్పొరేటర్లుగా గెలుపొందిన ఇద్దరు మేయర్లు అయ్యారు. వీరి హయాంలో వార్డులో అనుకున్న స్థాయిలో పనులు జరగలేదు. రహదారులు దుస్థితికి చేరుకున్నాయి. ఉద్యానవనాలు ఎక్కడ వేసిన గొంగళి అన్న విధంగా మారాయి. రోడ్లకు కనీసం బోర్డులు పెట్టి మొదటి క్రాస్, రెండో క్రాస్ అని రాస్తే అనుకూలంగా ఉంటుంది. ఈ వార్డును నగర పాలికెలోనే ఆదర్శంగా తీర్చిదిద్దే అవకాశం ఉన్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు.



\- తాళూరు పార్థసారథి, విద్యానగర్

పలు రహదారులు వేయించాం

34వ వార్డు వ్యాప్తిలోకి వచ్చే పలు రహదారులు వేయించాం. దుస్థితికి చేరుకున్న వాటిపై ఇంజినీర్‌తో నివేదిక సిద్ధం చేయించాం. తొందరలోనే బాగు చేయిస్తాం. కేసీ కొండయ్య కాలనీలోని రెండు రోడ్లు, విద్యానగర్‌లోని ఆంజనేయ గుడి ముందు నుంచి, 14వ ఉప కాలువపై వెళ్లే రహదారుల్లో నిర్మాణంలో ఉన్న రెండు వంతెనలు పూర్తయితే వాటినీ బాగు చేయిస్తాం. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. వార్డు మొత్తం ఎల్ఈడీ దీపాలు వేయించాం.



\- మోదపల్లి రాజేశ్వరి, మాజీ మేయర్

త్రిచక్ర వాహనాల వితరణ

కారటగి, న్యూస్‌టుడే: కారటగిలో ఆదివారం స్థానిక శాసనసభ్యుడు, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి 23 మంది దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతోందన్నారు. అర్హులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురసభ అధ్యక్షురాలు ఎ.రేఖ, ఉపాధ్యక్షురాలు దేవమ్మ, నాయకులు సిద్ధనగౌడ, శివారెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన



బురద రహదారులను దాటుతున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, తదితరులు

బళ్లారి న్యూస్‌టుడే: నగర పాలికె పరిధిలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముంపునకు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ఆదివారం ఉదయం పరిశీలించారు. తొలుత 20వ వార్డులోని హుసేన్‌నగర, రాయల్ కాలనీలను పరిశీలించిన ఆయన స్థానికుల నుంచి వివిధ సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించి మాట్లాడారు. వరద నీరు చేరిన ప్రాంతాలను పాలికె అధికారులు సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 24 గంటల్లో మురుగు కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని, వ్యాధులు వ్యాపించకుండా చూడాలని కమిషనర్ ఖలీల్‌సాబ్‌కు సూచించారు. ఆయన వెంట కార్పొరేటర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ అవసరం



సమావేశాన్ని ప్రారంభించిన రాష్ట్ర విధానపరిషత్ సభ్యులు నవీన్

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: ఆధునిక మహిళల జీవన భద్రతకు ఆర్థిక స్వేచ్ఛ చాలా అవసరమని విధానపరిషత్ సభ్యులు కేఎస్ నవీన్ అన్నారు. ఆదివారం ఆయన మాలప్పన హట్టి వద్దనున్న తిరుమల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యకర్తల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీలు చేతివృత్తులు చేస్తూ వివిధ వస్తువులు తయారుచేసి కుటుంబానికి ఆదరవుగా ఉంటున్నారన్నారు. ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఇలాంటి వనితలకు ఆర్థిక మద్దతు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ అందించే వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దినేశ్ పూజారి, తాలూకా సంచాలకుడు అశోక్, బ్యాంకు అధికారి మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సింధనూరులో అంబాదేవి ప్రసిద్ధి



జ్యోతి వెలిగిస్తున్న మాజీ మంత్రి నాడగౌడ తదితరులు



సత్కారం స్వీకరిస్తున్న విశ్రాంత కల్నల్ బలసు శ్రీనివాస్ తదితరులు

సింధనూరు: మైసూరులో తల్లి చాముండి లాగానే కల్యాణ కర్ణాటక ప్రాంతంలో అంబాదేవి ప్రసిద్ధి అని మాజీ మంత్రి వెంకట్రావు నాడగౌడ అన్నారు. స్థానిక ఆర్జీఎం మైదానంలో మూడో రోజు ఆదివారం సింధనూరు దసరా వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్త శక్తి పీఠాల్లో ఇదొకటని తెలిపారు. ఇక్కడి అంబాదేవి చేతిలో దేవీ చక్రం ఉండటం విశేషమన్నారు. పర్యాటక శాఖ అంబామఠం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. మూడో రోజు కార్యక్రమాలను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహించింది. మొత్తం మూడు వేదికల్లో వివిధ కార్యక్రమాలు జరిగాయి. టౌన్ హాల్లో వివిధ ప్రాంతాల సాహితీవేత్తలు తమ కవితలు చెప్పి ఆకట్టుకున్నారు. సాయంత్రం వేదికపై త్రివిధ దళాల్లో సేవలందించిన విశ్రాంత సైనికులు, అధికారులను సత్కరించారు. సింధనూరు వాసి భారత ఆర్మీ విశ్రాంత కల్నల్ బలసు శ్రీనివాస్ సత్కారం స్వీకరించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

06-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.17
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,662	4,437
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,422	9,572
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	52.740

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

రైతుల మేలుకే సహకార సంఘాలు



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి రాజణ్ణ

హొసపేటె, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ సహకార సంఘాలు రైతుల విశ్వాసాన్ని కాపాడుకోవాలని సహకార మంత్రి కె.ఎన్. రాజణ్ణ అన్నారు. తాలూకాలోని నాగేనహళ్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రాథమిక గ్రామీణ వ్యవసాయ సహకార సంఘం శత వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్షకులు సంఘాల్లో తీసుకున్న రుణాలను సరైన సమయంలో తిరిగి చెల్లిస్తేనే వాటి మనుగడ సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న సహకార సంఘం వందేళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. అన్నదాతల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. రుణాల మాఫీ, శూన్య వడ్డీని జారీలో తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పంటలకు మద్దతు ధర దక్కాలని, వారి ఉత్పత్తులకు వారే ధర ఖరారు చేసే పరిస్థితి రావాలన్నారు. హొసపేటెలో సహకార రంగం లేదా ప్రైవేటు ఆధ్వర్యంలో ఓ చక్కెర మిల్లు ఏర్పాటుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం బ్యాంకు శతవార్షికోత్సవ ప్రత్యేక సంపుటి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గవియప్ప, కొట్టూరు మఠం ముప్పిన బసవలింగ స్వామి, నరగగడ్డి శాంతలింగ స్వామి, కాంగ్రెస్ నాయకురాలు బి.ఎల్.రాణిసంయుక్త, బీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు గుండుమణుడు తిప్పేస్వామి, హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజీ తదితరులు పాల్గొన్నారు.


ఛాయాచిత్రాల పోటీలో స్వర్ణ పతకాలు



తొలి క్షురకర్మ



పోర్ట్రేట్ హెచ్‌కే



శ్రీనివాస్ ఎణ్ణి

గంగావతి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఛాయాచిత్రాల పోటీల్లో గంగావతికి చెందిన శ్రీనివాస్ ఎణ్ణి రెండు విభాగాల్లో బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. గ్రీక్ ఆర్టిస్టిక్, ది ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ సింగపూర్, అమెరికాకు చెందిన అట్లాంటిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ సంస్థలు 9వ పసిఫిక్ అట్లాంటిక్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ సర్క్యూట్-2014 పేరిట ఈ పోటీలు నిర్వహించాయి. 46 దేశాల నుంచి 349 మంది ఫొటోగ్రాఫర్లు 1396 చిత్రాలతో పోటీపడినట్లు శ్రీనివాస్ తెలిపారు. మోనోక్రోమ్ విభాగంలో తొలి క్షురకర్మ, పోర్ట్రేట్ హెచ్‌కే చిత్రాలకు బంగారు పతకాలు వచ్చాయని ఆయన చెప్పారు. శ్రీనివాస్ గంగావతిలోని విద్యుత్తు శాఖ డివిజన్ కార్యాలయంలో సహాయక ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

వైద్యులు దేవుళ్లతో సమానం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సమాజంలో రోగులకు చికిత్స అందించి జీవం పోసే వైద్యులను దేవుళ్లతో సమానంగా చూస్తామని తెక్కలకోట కంబాళిమఠం మఠాధిపతి వీరభద్రశివాచార్య స్వామి అన్నారు. మఠం ఆవరణలో శరన్నవ రాత్రులు సందర్భంగా దేవిపురాణ కార్యక్రమానికి ఆయన సాన్నిధ్యం వహించి మాట్లాడారు. వైద్యులు రోగులకు నిస్వార్థంగా సేవలందిస్తారని చెప్పారు. అడ్డదారుల్లో సంపాదన కుటుంబంతో పాటు సమాజానికి మంచిది కాదన్నారు. అనంతరం బళ్లారికి చెందిన ప్రముఖ వైద్యులు దివాకర గడ్డి, సోమనాథ్ ఎస్.ఎం, సదాశివగౌడ, జయశ్రీ, ఉమా మహేశ్వరి, గీతలను సన్మానించారు. వైద్యులు మాట్లాడుతూ తమను సత్కరించి సమాజానికి మరింత మెరుగైన సేవలందించేలా ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖులు శరణయ్యస్వామి, లింగనగౌడ, జ్ఞానానంద స్వామి, వీరేశప్ప, మల్లికార్జున, చన్నబసవ, బసవరాజయ్య స్వామి, డా.ప్రమోద్ హిరేమఠ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న స్వామి తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులతో సంస్థ అధ్యక్షుడు తదితరులు



పోటీలకు ఎంపికైన బాలురు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్, గంగావతి శ్రీవిద్యా నికేతన్ పీయూ కళాశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

త్రోబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్‌తో పాటు వ్యక్తిగతంగా కరాటేలో ఆరు విభాగాల్లో, హర్డిల్స్ జంప్ రోప్ పోటీల్లో బాలురు ప్రథమ స్థానాల్లో నిలిచారు. చదరంగం, కరాటే పోటీల్లో బాలికలు ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. 120మంది పైగా విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కళాశాల ఆవరణలో విజేతలను నెక్కంటి సూరిబాబు, ఆదర్శ, నరేశ్, ఉమా శంకర్, మల్లికార్జున, జగన్నాథరావు, నాగేశ్ తదితరులు అభినందించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న గిరీశ్ తదితరులు

చెళ్లకెర (చిత్రదుర్గం): తమ సంస్థ ఈ ఏడాది ఉన్నత వ్యాసంగానికి మద్దతుగా 65 మంది ప్రతిభావంత పేద విద్యార్థులకు రూ.8 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు ఆశాకిరణ సంస్థ అధ్యక్షుడు గిరీశ్ తెలిపారు. ఆదివారం ఇక్కడి రోటరీ భవన్‌లో ఎంపికైన ప్రతిభావంత విద్యార్థులకు ఆయన చెక్కులు అందజేసి మాట్లాడారు. 13 మంది కలిసి స్వచ్ఛంద సంస్థగా ఏర్పాటు చేసుకొని పేద విద్యార్థులకు ఆర్థిక సాయమందిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్ద కాలంలో మొత్తం 800 మంది విద్యార్థులు తమ సంస్థ నుంచి ఆర్థిక చేయూత పొందారన్నారు. వీరంతా ఉన్నత స్థానాలకు చేరుకొని తమలాంటి వారికి సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంస్థ మాజీ అధ్యక్షులు, చార్టర్డ్ అకౌంటెంటు మధుప్రసాద్, డైరెక్టర్లు రవిప్రసాద్, గురురాజ్, కేశవమూర్తి, ప్రసన్నకుమార్, నాగరాజ్, మృణాళిని తదితరులు పాల్గొన్నారు.


ఒత్తిడిని జయిస్తేనే గుండె పదిలం



చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంటూ, ఒత్తిళ్లను జయిస్తే మనిషి గుండె పదిలంగా ఉంటుందని కొప్పళలోని కేఎస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు బసవరాజ్ క్యావటర్ అన్నారు. కొప్పళలోని కేఎస్ ఆసుపత్రి, కిర్లోస్కర్, బీఎంఎం సంస్థలు కలిసి ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వాకథాన్‌లో ఆయన మాట్లాడారు. చిన్న వయసులోనే చాలామందికి గుండె జబ్బులు రావటానికి కారణం ఒత్తిడేనని తేల్చి చెప్పారు. రైల్వేస్టేషన్ మార్గంలోని స్వాతంత్ర్య ఉద్యానవనం నుంచి జిల్లా క్రీడా మైదానం వరకు సాగిన వాకథాన్‌లో ఆసుపత్రి సిబ్బంది, పారా మెడికల్ విద్యార్థులు, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, హొసపేటె

కేంద్ర మంత్రి సోమణ్ణ సుడిగాలి పర్యటన



కేంద్ర మంత్రి సోమణ్ణను సత్కరించిన మాజీ మంత్రి శ్రీరాములు తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమణ్ణ నగరంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుడిగాలి పర్యటన చేశారు. ఆదివారం ఉదయం శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మను దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి పార్వతినగరలోని శివాలయానికి వెళ్లి భాజపా సభ్యత్వ నమోదును ప్రారంభించారు. తదుపరి హవం బావిలోని మాజీ మంత్రి శ్రీరాములు ఇంటికి చేరుకుని ఉపాహారం తీసుకుని ఆయనతో చర్చించారు. బళ్లారి జిల్లా నూతన సంకీర్ణ భవనంలో రైల్వే, వివిధ శాఖల అధికారులతో ప్రగతి సమీక్ష చేశారు. నగర శివారు ప్రాంతంలో రైల్వే లైన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న రైతులతో సంగనకల్లు రహదారిలోని కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. సర్వేపై పలు అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో రైల్వే లైన్ పనులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం బళ్లారి నుంచి రోడ్డు మార్గంలో సిరుగుప్ప బయలుదేరారు. రైల్వే మంత్రికి బళ్లారి వాణిజ్య పరిశ్రమల సంస్థ అధ్యక్షులు యశవంత్‌రాజ్ నాగిరెడ్డి నేతృత్వంలో వివిధ రైల్వే అభివృద్ధి పనులపై మనవి చేశారు. ఆంధ్రాళ్ సేవా సమితి సంఘం అధ్యక్షుడు రేకుల వెంకటరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ తదితరులు వివిధ సమస్యలపై మంత్రికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

ముగిసిన మద్య విముక్తి శిబిరం

కారటగి, న్యూస్‌టుడే: వివిధ సంఘ సంస్థల సహకారంతో ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన కారటగి కెరె బసవేశ్వర కల్యాణ మంటపంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న మద్యపాన వ్యసన విముక్త శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు పూర్ణ కుంభాలతో రాగా పట్టణంలో చైతన్య జాత నిర్వహించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన జాతా పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. శిబిరానికి హాజరైన వారు మద్యపానానికి వ్యతిరేకంగా ఫ్లకార్డులు ప్రదర్శించారు. మరుళ సిద్ధయ్యస్వామి, తలేఖాన్ మఠ వీరభద్ర శరణరు, ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన, అఖిల కర్ణాటక జన జాగృతి వేదిక, ప్రగతి బంధు స్వసహాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



పూర్ణ కుంభాలతో జాతాలో పాల్గొన్న మహిళలు, తదితరులు

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న కల్మఠ స్వామీజీ



కబడ్డీలో తలపడుతున్న బాలికల జట్టు

మాన్వి, న్యూస్‌టుడే : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంలో అమెచర్ కబడ్డీ సంఘం ఏర్పాటు చేసినట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు రవికుమార్‌పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏపీఎంసీ యార్డులో జిల్లా స్థాయి ప్రోకబడ్డీ క్రీడ ప్రారంభంలో మాట్లాడారు. 4 బాలురు, 4 బాలికల కబడ్డీ బృందాలు పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ, ప్రముఖులు తిమ్మారెడ్డి భోగావతి, అక్బర్‌సాబ్, రామచంద్రనాయక్, బాలస్వామి కొడ్లి, శివరాజ్‌నాయ్, ఎం.ప్రవీణ్‌కుమార్, వీరేశ్ నాయక్, శివరాజ్, శరణప్ప మేదా, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

అధ్యక్ష స్థానానికి రాజీనామా

బెళగావి, న్యూస్‌టుడే: బెళగావి జిల్లా డీసీసీ బ్యాంకు అధ్యక్ష స్థానానికి మాజీ ఎంపీ రమేశ్ కత్తి రాజీనామా చేశారు. నాలుగేళ్ల క్రితం ఏకగ్రీవంగా ఎన్నికైన రమేశ్ కత్తిపై ఇప్పుడు కొందరు డైరెక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సూచనతో ఆయన రాజీనామా చేశారని ఎమ్మెల్యే బాలచంద్ర జార్ఖిహొళి తెలిపారు. అక్టోబరు 8 లోగా నూతన అధ్యక్షుడిని నియమిస్తామని ఆయన ప్రకటించారు. తనకు బ్యాంకుతో 42 ఏళ్ల అనుబంధం ఉండగా, అందులో పదేళ్లు డైరెక్టరుగా, 27 ఏళ్లు, అధ్యక్షుడిగా, ఐదేళ్లు ఉపాధ్యక్షుడిగా సేవలు అందించానని రమేశ్ కత్తి గుర్తు చేసుకున్నారు. ఇతర డైరెక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని తాను గుర్తించానన్నారు. వారు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టక మునుపే బాలచంద్ర సూచనలతో తాను పదవికి రాజీనామా చేశానని చిక్కోడిలో తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు.


ఇద్దరు అధికారుల బదిలీ

బెంగళూరు (శివాజీనగర): వివిధ శాఖల్లో సేవలు అందిస్తున్న ఇద్దరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు, వారికి కేటాయించిన శాఖలు ఇలా ఉన్నాయి. డాక్టర్ త్రిలోక్ చంద్ర (కమిషనర్, పాఠశాల విద్యాశాఖ), బీబీ కావేరి (ముఖ్యమంత్రికి కార్యదర్శి, సమాచార శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు).

అరేబియా దరి..

- అందాలతో కట్టిపడేస్తున్న నేత్రాణి దీవి
- ఈ సెలవుల్లో సరదాగా చుట్టేద్దాం

పర్యాటక ఝరి



హృదయ ఆకారంలో ఉన్న నేత్రాణి దీవి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: కర్ణాటక కోస్తా తీరంలోని అరేబియా సముద్రంలో అద్భుతమైన పర్యాటక కేంద్రాలను మైసూరు దసరా ఉత్సవాలను హాజరవుతున్న స్వదేశీ విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. మాలె దీవులను తలపించేలా ఉన్న ప్రదేశాలను పర్యాటకులు తిలకించేందుకు ప్రత్యేక పడవ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ముడేశ్వర సమీపంలోని 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేత్రాణి దీవి పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. అక్కడున్న స్కూబా డైవింగ్ చేసేందుకు యువత మక్కువ చూపుతున్నారు. హృదయ ఆకారంలో ఈ దీవి ఉండటంతో పాటు అక్కడ ఏపుగా పెరిగిన చెట్లు వాటిల్లో సంచరించే వన్యజీవులు, ప్రాచీన హనుమంతుడి దేవస్థానం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అక్కడికి పడవలో వెళ్లాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడవలు సంచరిస్తాయి. రాత్రిళ్లు దీవిలో ఉండేందుకు అవకాశం లేదు. సముద్రం నీటిలో మునిగేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. గోవా తరువాత స్కూబా డైవింగ్ నేత్రాణి దీవి వద్ద ఉంది. పర్యాటకులు దీవిలో సంచరించేందుకు ఇష్టపడుతున్నారు. రక్షణ కవచాలతో పాటు ఆక్సిజన్ సిలిండర్ ధరించి సముద్రం లోపల విహరించేందుకు అవకాశం ఉంది. సముద్రం లోప వివిధ రకాల చేపలు, నత్తలు, తాబేళ్లు, వృక్షాలు తదితర వాటిని తిలకించవచ్చు. ఈతలో ప్రావీణ్యం సాధించిన వ్యక్తులు లోపలకు వెళ్లి వారిపై నిఘా వేసేందుకు గజఈతగాళ్లు వెంట ఉంటారు. సముద్రం లోపల అందమైన దృశ్యాలను తిలకించవచ్చు. ఇందు కోసం యువత దీవిని సందర్శించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దసరా, దీపావళి సెలవు రోజుల్లో పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. నేత్రాణి దీవికి వెళ్లేందుకు ముందస్తుగా స్థానిక అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు ఇప్పటికే ఆరువేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.



తాబేళ్లు సంచారం



దీవికి పడవల్లో ప్రయాణించాలి



దీవి సమీపంలో సముద్రంలో మునుగుతున్న పర్యాటకులు



వివిధ జాతుల చేపలు

వారసత్వ కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత



జెండా ఊపుతున్న దేవరాజు

మైసూరు, న్యూస్‌టుడే: రాచనగరి, సాంస్కృతిక నగరిగా గుర్తింపు దక్కించుకున్న మైసూరులో వందల సంఖ్యలో వారసత్వ కట్టడాలు, మార్గాలు, ప్రాంతాలు ఉన్నాయని పురావస్తు శాఖ కమిషనర్ దేవరాజు తెలిపారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విఖ్యాత దసరా ఉత్సవాల్లో భాగంగా టౌన్‌హాల్ నుంచి వివిధ వారసత్వ భవనాలు ఉన్న మార్గంలో నిర్వహించిన 'హెరిటేజ్ వాక్'ను జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. టాంగా సవారీ, బైకు సవారీ, వారసత్వ వీధుల్లో నడకతో నగరంలోని నిర్మాణాల శైలి, వాటి ప్రత్యేకతలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మైసూరు రాజులు నిర్మాణాల్లో ఆర్కిటెక్చర్‌కు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. చామరాజనగర విశ్వవిద్యాలయం ఉపకులపతి గంగాధర్, సంగీత విశ్వవిద్యాలయం ఉప కులపతి నాగేశ్ బెట్టకోటెలతో కలిసి 350 మందికి పైగా స్థానికులు నడకలో పాల్గొన్నారు. రంగాచార్యులు పురభవన నుంచి ప్రారంభమైన నడక సిల్వర్ జూబ్లీ క్లాక్ టవర్, మేసన్ క్లబ్, పదో చామరాజ ఒడెయరు కూడలి, అంబావిలాస ప్యాలెస్, నల్వడి కృష్ణరాజ ఒడెయరు కూడలి, చిక్క గడియార కూడలి, దేవరాజ మార్కెట్, కృష్ణరాజేంద్ర ఆసుపత్రి, మైసూరు వైద్య కళాశాల, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, చామరాజేంద్ర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్, గాంధీ కూడలి మార్గంలో పురభవనకు చేరుకోవడంతో 'హెరిటేజ్ వాక్' ముగిసింది.

వర్చ్యువల్ రియాల్టీ కార్డు

నగరంలోని పురాతన భవనాలు, వారసత్వ కట్టడాలు, మ్యూజియంలను వర్చ్యువల్ రియాల్టీ ద్వారా వీక్షించేందుకు ఆసక్తి ఉన్న వారి కోసం క్యూఆర్ కోడ్ ఉన్న ప్రత్యేక కార్డును అందుబాటులోకి తీసుకువచ్చామని దేవరాజ్ తెలిపారు. ఈ కార్డు ధర రూ.10. దానిపై ఉన్న కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ప్రముఖ కట్టడాలు, ప్యాలెస్‌లు, వీధులను వర్చ్యువల్ రియాల్టీ విధానంలో చూడవచ్చని ఆయన వివరించారు.

ముమ్తాజ్ అలి అదృశ్యం



ముమ్తాజ్ అలి దూకిన ఫల్గుణి నదిలో గాలింపు చర్యలు

మంగళూరు, న్యూస్‌టుడే: మంగళూరు నగర మాజీ ఎమ్మెల్యే మొయినుద్దీన్ బావా సోదరుడు బీఎం ముమ్తాజ్ అలి (52) ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయారు. ముస్లిం నాయకునిగా, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఆయనకు చక్కని గుర్తింపు ఉంది. ఆయన విలాసవంతమైన కారు కోళూరు వంతెన వద్ద కనిపించింది. ఫల్గుణి నదిలోకి దూకి ఉంటారన్న అనుమానంతో జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం, తీరప్రాంత రక్షణ దళం, స్థానిక మత్స్యకారులు, అగ్నిమాపక దళ సిబ్బంది నదిలో గాలింపు చేపట్టారు. గజ ఈతగాడు ఈశ్వర్ మల్పే నాలుగు గంటలపాటు నదిలో గాలించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: దాసరహళ్లి మెట్రో స్టేషన్‌కు సమీపంలో శనివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో రాజగోపాలనగర నివాసి శేషాద్రి (23) అనే యువకుడు మరణించాడు. బైకులో ఇంటికి వెళుతున్న అతన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదానికి కారకుడైన డ్రైవరు లారీని వదిలి పరారయ్యాడు. పీణ్య ట్రాఫిక్ ఠాణా పోలీసులు లారీని స్వాధీనపరుచుకుని, పరారైన డ్రైవరు కోసం గాలింపు తీవ్రం చేశారు.

విద్యుత్తు వాహనాలకు స్మార్ట్ బ్యాటరీలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాయుమాలిన్యం నియంత్రించేందుకు విద్యుత్తు ఆధారిత వాహనాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండటంతో పాటు ఆ వాహనాలకు అమర్చే నాజూకు బీ2బీ బ్యాటరీలకు పెద్దపీట వేశారు. ఎక్కువ కాలం మన్నిక వచ్చే నాజూకు బ్యాటరీలను విద్యుత్తు ఆధారిత వాహనాలకు అమర్చుతున్నట్లు నాజూకు బ్యాటరీ సంస్థ ఉపాధ్యక్షురాలు తనుశ్రీ భట్టాచార్య తెలిపారు. శుక్రవారం ఇక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రానున్న కాలం విద్యుత్తు ఆధారిత వాహనాలదేన్నారు. 2025 కల్లా నాజూకు బ్యాటరీ స్వాపింగ్ సాంకేతిక పరిజ్ఞానం కలిగి 20 వేల వాహనాలకు అమర్చాలని నిర్ణయించినట్లు తెలియజేశారు.

చోదకుడు, కండక్టర్‌కు బెదిరింపు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: అత్తిబెలె నుంచి మెజెస్టిక్ మధ్య సంచరించే బస్సులో గురువారం రాత్రి ప్రయాణించిన వ్యక్తి ఒకరు డ్రైవరు, కండక్టర్‌లను స్క్రూడ్రైవర్‌తో పొడుస్తానని బెదిరించాడు. కోనప్పనఅగ్రహార వద్ద బస్సును నిలపకపోవడంతో తన సంచి నుంచి స్క్రూడ్రైవరు తీసి బెదిరించాడు. ప్రయాణికులు ఈ ఘటనను మొబైల్‌లో ఫొటో తీసుకున్నారు. డ్రైవరు భయంతో బస్సు నిలపగా అతను దిగి వెళ్లిపోయాడు. బీఎంటీసీ సిబ్బంది ఫిర్యాదుతో మడివాళ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాజ్యోత్సవ పురస్కారాల సమితి ఏర్పాటు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: కన్నడ రాజ్యోత్సవ పురస్కారాల సమితి-2024ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగి సమితికి అధ్యక్షుడిగా, కార్యదర్శి ఆ శాఖ ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. వివిధ రంగాలకు చెందిన 50 మంది ప్రముఖులతో సమితి ఏర్పాటు చేశారు. నవంబరు ఒకటిన జరిగే కార్యక్రమంలో సమితి ఎంపిక చేసే ప్రముఖులకు కన్నడ రాజ్యోత్సవ పురస్కారాలను అందజేస్తుంది.

కలరాగా ధ్రువీకరించిన వైద్యులు

ఉడుపి, న్యూస్‌టుడే: దక్షిణ కన్నడ జిల్లాలో ఉప్పుంద, దానికి సమీపంలోని ఉడుపి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో కలరా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. ఇప్పటికే ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 800 మంది ఇళ్లకు తిరిగి వచ్చారు. మరో 200 మందికి ఆసుపత్రుల్లో చికిత్స కొనసాగుతోంది. కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన బాధితులను తహసీల్దారు ప్రదీప్ పరామర్శించారు. పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీల అధికారులకు సూచించారు.

జాగిలాల నాజూకు షోకు



తన జాగిలం గోపితో సుధామూర్తి

మైసూరు, న్యూస్‌టుడే: మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా జీకే మైదానంలో ఆదివారం నిర్వహించిన జాగిలాల ప్రదర్శనకు ప్రాణిప్రియుల నుంచి చక్కని స్పందన లభించింది. దేశ విదేశీ జాతుల జాగిలాలను వాటి యజమానులు పోటీకి తీసుకువచ్చారు. జర్మన్ షెఫర్డ్, టిబెటియన్ మస్టిఫ్, ఇండియన్ మస్టిఫ్, డాబర్ మ్యాన్, ముధోళ్, సైబీరియన్ హస్కి, ఐషిర్ శెట్టర్, అటికా, ల్యాబ్రడార్, పూడ్లే, డాగో అర్జెంటీనా, గ్రేట్ డేన్, పమేరియన్, రాజ పల్యమ్, పిట్‌బుల్, గోల్డెన్ రిట్రీవర్, కాకర్ స్ప్యానియల్, అమెరికన్ బుల్లీ, బాక్సర్, బీగల్, ఫ్రెంచ్‌బుల్ డాగ్, చౌచౌ, పగ్, డచ్ షెఫర్డ్, టిబెటియన్ స్ప్యానియల్, రాట్‌విల్లర్, సెయింట్ బెర్నాడ్ తదితర 45 జాతులకు చెందిన 480 జాగిలాలు పోటీ పడ్డాయి. గత ఏడాది దసరాలో కేవలం 20 జాతుల జాగిలాలు పోటీ పడ్డాయి. మనదేశంలోనూ పెంపుడు జంతువులను పెంచుకునే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని రాజ్యసభ సభ్యురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తి తెలిపారు. వీధుల్లో గాయపడి, జబ్బు పడిన జాగిలాలను రక్షించి, వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రాణిప్రియులు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. పోటీకి సుధామూర్తి తీసుకువచ్చిన పెంపుడు జాగిలం గోపి కూడా బహుమతి గెల్చుకుంది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ జాగిలాలకు వేర్వేరు విభాగాల్లో బహుమతులు ప్రదానం చేశారు.



పోటీకి సిద్ధంగా వరుసలో నిలబడిన జర్మన్ షెప్పర్డ్ జాతి జాగిలాలు



తమ పెంపుడు శునకాలను ప్రదర్శిస్తున్న యువతులు



పోటీకి తమ జాగిలాలను సిద్ధం చేస్తున్న వాటి యజమానులు

సేవకు సై!!

ఉత్సాహంగా విప్రో బెంగళూరు మారథాన్



ఫుల్‌మారథాన్ మహిళా విజేతలుకు సత్కారం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థల సహాయార్థం ఆదివారం కంఠీరవ స్టేడియంలో జరిగిన విప్రో బెంగళూరు మారథాన్ పరుగు కార్యక్రమంలో 30 వేలమందికి ఔత్సాహికులు పాల్గొని తమ ప్రతిభా సామర్థ్యాలను నిరూపించుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలను పరుగు పోటీల రాయబారి, మాజీ అంతర్జాతీయ క్రీడాకారిణి రీత్‌అబ్రహం, రేస్ డైరెక్టర్ నాగరాజ్ ప్రారంభించగా పది కిలోమీటర్ల హాఫ్ మారథాన్ పరుగుకు పద్మశ్రీ పుల్లెల గోపీచంద్, ఎంపీ తేజస్వీసూర్య, ట్రాఫిక్ అదనపు కమిషనర్ రాజేందర్‌కుమార్ కటారియా, కె.గోవిందరాజు పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ ఫిట్‌నెస్, ఆరోగ్యంతో పాటు సమాజసేవ కోసం ఏర్పాటు చేసిన ఈ పరుగులో పాల్గొనడం అద్భుతంగా ఉందని తెలిపారు. శ్రీరామ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ ఛైర్మన్ మురళీ మలయప్పన్ మాట్లాడుతూ బెంగళూరు మారథాన్‌కు చక్కని స్పందన లభించిందన్నారు. ఐదు కిలోమీటర్ల రేస్‌లో ఎన్జీవోలు కార్పొరేట్‌లు, సీనియర్ సిటిజన్లు, ఔత్సాహికులు పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌లో పురుషుల విభాగంలో ఆర్మీకి చెందిన కార్తీక్‌కుమార్, ప్రదీప్‌సింగ్ చౌదరి, రైల్వేస్‌కు చెందిన హర్షద్ వరుసగా బంగారు, రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. మహిళల విభాగంలో రైల్వేస్‌కు చెందిన కె.ఎల్. లక్ష్మీ, అశ్వినీమదన్‌జాదవ్, జ్యోతిశంకరరావుగవాటే దక్కించుకున్నారు. హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో అశోక్‌బిందే, నంజుడప్ప, బుగేలేకుమార్, 10 కిలోమీటర్ల రేస్ పురుషుల విభాగంలో అవిక్‌భట్టాచార్య, విజయ్‌కుమార్, శివానంద పతకాలు గెలిచారు. మహిళల విభాగంలో భారతి, కియోకోహ ష్మిమటో, వైభవి తొలి మూడు స్థానాలతో బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు.



పతకాలు పొందిన పదికిలోమీటర్ల పరుగు విజేతలు



ఫుల్‌మారథాన్ విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రాప్తి చిత్రంలో జయసూర్య, గౌరిసాగర్

'ప్రాప్తి' చిత్రం సిద్ధం

ఆధునిక కుటుంబం నేపథ్యంతో కూడిన 'ప్రాప్తి' చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. సెన్సార్ ప్రక్రియలను పూర్తి చేసుకున్నట్లు దర్శకుడు సాయిప్రకాశ్ తెలిపారు. మూడు పాటల రికార్డు సాగిస్తున్నట్లు తెలియజేశారు. కుటుంబ కథా చిత్రమైన వివిధ మలుపులు తిరుగుతూ ముందుకు సాగుతుందన్నారు. హీరో జయసూర్య, హీరోయిన్ గౌరిసాగర్, నిఖితరామ్, మోనిషా థామస్, కళస మంజునాథ్, అజిత్‌జైన్, మంజులారెడ్డి, కమల్‌జి. మిరాయ్, ఆల్కానంద శ్రీనివాస్, ప్రకృతి, మేఘరాజకుమార్, రామమూర్తి, నిహారిక తదితరులు నటిస్తున్నారు.

11న 'మార్టీన్' వస్తున్నాడు

హీరో ధ్రువసర్జా, హీరోయిన్ వైభవి శాండిల్యా నటిస్తున్న 'మార్టీన్' చిత్రం ఈనెల 11న దేశవ్యాప్తంగా మూడువేల థియేటర్లలో విడుదల కానుంది. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ తదితర భాషల్లో విడుదల చేస్తామని దర్శకుడు ఏపీ అర్జున్ తెలిపారు. భారీ బడ్జెట్‌తో కూడిన సినిమా కావడంతో దేశంలోని వివిధ నగరాల్లో ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలియజేశారు. విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిదన్నారు.



మార్టీన్ చిత్రంలో ధ్రువసర్జా, వైభవి శాండిల్య

నవంబరు 22న ఆరామ్ అరవిందస్వామి రాక

హీరో అనీశ్ తేజేశ్వర్ నటిస్తున్న హస్యభరితమైన చిత్రం 'ఆరామ్ అరవిందస్వామి' నవంబరు 22న రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కానుంది. కుటుంబ సమేతంగా ఆకట్టుకుంటుందని దర్శకుడు అభిషేక్ శెట్టి తెలిపారు. హీరోయిన్లు మిలనా నాగరాజ, హృతిక శ్రీనివాస్ తదితరులు నటిస్తున్నారు.





జీబ్రా చిత్రం టీజర్ కార్యక్రమంలో తెలుగు నటుడు విష్ణుతో హీరోలు డాలిధనంజయ, సత్యదేవ్

'జీబ్రా' టీజర్ విడుదల

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: డాలిధనంజయ్, సత్యదేవ్ కలిసి నటిస్తున్న 'జీబ్రా' టీజర్‌ను ప్రముఖ సినీనటుడు శివరాజ్‌కుమార్, తెలుగు నటుడు విష్ణు కలిసి విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళికి దేశవ్యాప్తంగా విడుదలకు సిద్ధం చేస్తున్నారు. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో చిత్రాన్ని ఎస్ఎన్‌రెడ్డి, ఎస్.పద్మజా, బాలసుందరం నిర్మిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ కూడిన చిత్రమని దర్శకుడు ఈశ్వర్‌కార్తీక్ తెలిపారు. రవిబస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

కేంద్ర నిబంధనలు తప్పనిసరి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: పెద్ద నోట్లను రద్దు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థలు అనుసరించాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. భారతీయ రిజర్వు బ్యాంకు వేసుకున్న అప్పీలును పరిగణనలోకి తీసుకుని జస్టిస్ సునీల్ దత్ యాదవ్, జస్టిస్ రామచంద్ర డి హుద్దార్‌ల పీఠం ఈ ఆదేశాలు ఇచ్చింది. రద్దయిన నోట్లను మార్చుకునే అంశంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

చలువాది పోరాటాన్ని భాజపా గుర్తించింది



చలువాది నారాయణస్వామి దంపతులను సత్కరిస్తున్న బీఎల్ సంతోశ్, విజయేంద్ర

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: అణగారిన వర్గాల శ్రేయస్సుకు పోరాటం చేస్తున్న చలువాది నారాయణ స్వామిని భాజపా గుర్తించి రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. పార్టీలో నాయకునిగా, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తూ తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారని అభినందించారు. చలువాది నారాయణ స్వామి దంపతులను ఆదివారం ఇక్కడ సత్కరించి మాట్లాడారు. యడియూరప్ప, అనంతకుమార్ తదితర నాయకులు నగరాల నుంచి గ్రామాలకు భాజపా సిద్ధాంతాన్ని తీసుకువెళ్లారని, వారి అడుగుజాడలను ప్రతి నాయకుడు, కార్యకర్త అనుసరించవలసి ఉందన్నారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయం చేయడం కన్నా, నాయకుడిగా ఆయన సూచించిన మార్గంలో తాను ప్రయాణిస్తున్నానని తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ పేరు చెప్పుకొని ఆరు దశాబ్దాలు రాజకీయం చేసిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను వంచించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో పోరాటాలు చేస్తూ నాలుగు దశాబ్దాల పాటు అనాథ శిశువుగా ఉన్న తనను భాజపా గుర్తించి, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని చలువాది నారాయణ స్వామి తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మన దేశం అభివృద్ధిలో ముందంజలో ఉందని భాజపా నాయకుడు బీఎల్ సంతోశ్ తెలిపారు. ప్రస్తుతం మనం సంధికాలంలో ఉన్నామని చెప్పారు. పేదలు, అణగారిన వర్గాలకు గళం ఇచ్చేందుకు ప్రతి నాయకుడు శ్రమించాలని పిలుపునిచ్చారు. వివిధ మఠాల ప్రతినిధులు సిద్ధరామ స్వామి, సేవాలాల్ స్వామి, జ్ఞానప్రకాశ స్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి గోవింద కారజోళ, ప్రధాన కార్యదర్శి పి.రాజీవ్ పాల్గొన్నారు.

బెంగళూరు
•బెంగళూరు •హోసూరు

ఎమ్మెల్యే కార్యాలయంలో ఉత్సవాలు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : శరన్నవరాత్రి సందర్భంగా యశ్వంతపుర ఎమ్మెల్యే కార్యాలయంలో చాముండేశ్వరిని ప్రతిష్ఠించి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఆదివారం కుష్మాండ అమ్మవారి పూజ చేశారు. హేరోహళ్లి వార్డులో ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువులో మహిళలు పూజలు చేసి హారతలు పట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. గ్రామ పంచాయతీ ప్రముఖులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు.


కార్యాలయంలో బొమ్మల కొలువు


సంగీతాన్ని వినిపిస్తున్న లవిత్‌శెట్టి

కళాసంగమకు చక్కని స్పందన

బెంగళూరు (మల్లేశ్వరం) : వరల్డ్ మ్యూజిక్ కన్సర్వేటివ్ సంస్థ వార్షికోత్సవాల్లో భాగంగా అలయన్స్ ఫ్రాంఛైస్ ఆడిటోరియంలో నిర్వహించిన కళాసంగమ-2024 ప్రదర్శనకు చక్కని స్పందన లభించింది. మల్లేశ్వరం, బసవనగుడిశాఖల్లో ఆయా సంగీత వాద్యాలు, శాస్త్రీయ, హిందూస్తానీ సంగీతంలో శిక్షణ పొందిన విద్యార్థులు శని, ఆదివారాల్లో ప్రదర్శలు ఇచ్చారు. ఫ్లూటు వాదనలో ఈశ్వరి జేపీ, కీబోర్డు వాదనలో లవిత్‌శెట్టి ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.


మురళీగానంలో బాల కళాకారులు

హోసూరు కబుర్లు

మత్తుపదార్థాలు ఆరోగ్యానికి హానికరం


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్

హోసూరు, న్యూస్‌టుడే : మత్తు పదార్థాలు, పొగాకు వాడకం నుంచి దూరంగా ఉండాలని హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్ పిలుపునిచ్చారు. హోసూరులో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మత్తు పదార్థాలను ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరమని, యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. హోసూరు రోటరీ క్లబ్, హోసూరు రోటరీ రాయల్స్, వరం ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం కల్పించారు. వివిధ కళాశాలల విద్యార్థులు ర్యాలీలో నడిచారు. ర్యాలీ హోసూరు రింగ్ రోడ్డులోని శిష్య పాఠశాల నుంచి రైతు బజారు చేరుకొంది. కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధ్యక్షుడు మాదేశ్వరన్, తదితరులు పాల్గొన్నారు. మూకండపల్లి హిల్స్ హోటల్ సభా ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్య పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వాహకులు కృష్ణకుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.

ఉచిత ఆరోగ్య చికిత్స శిబిరం


ఉచిత ఆరోగ్య చికిత్స శిబిరంలో కృష్ణగిరి పార్లమెంట్ సభ్యుడు గోపినాథ్

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు రైల్వేస్టేషన్ రోడ్డులోని కల్యాణ మంటపంలో ఆదివారం ఉచిత ఆరోగ్య చికిత్స శిబిరం జరిగింది. మనిదనేయ జననాయక పార్టీ, హోసూరు వరం ఆసుపత్రి నేతృత్వంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ముఖ్య అతిథిగా ఎంపీ కె.గోపీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడానికి హోసూరులోని ఆసుపత్రులు, పరిశ్రమల యాజమాన్యం, రాజకీయ పార్టీలు సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రోగులకు వరం ఆసుపత్రి వైద్యులు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు సాధిక్, బత్తలపల్లి నాగరాజు, ఆరిఫ్, మైజా అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింట ప్రచారం ముమ్మరం చేయాలి


ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌లో నాయకులు

హోసూరు, న్యూస్‌టుడే : డీఎంకే మైనార్టీ సంక్షేమ విభాగం కార్యవర్గ సమావేశం చెన్నైలోని డి.ఎం.కె.కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలవడానికి మైనార్టీ ఓటర్లను ఆకర్శించడానికి ఇప్పటి నుంచి ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు నెహ్రూ, భారతి, మైనార్టీ విభాగం సహ కార్యదర్శి, హోసూరుకు చెందిన వి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తంబిదురైకు ఘన స్వాగతం


తంబిదురైకు శుభాకాంక్షలు తెలుపుతున్న మురళి

హోసూరు, న్యూస్‌టుడే : మాజీ డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ సభ్యుడు ఎం.తంబిదురైకు ఆదివారం హోసూరులో ఏఐఏడీఎంకే నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తంబిదురైను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ కమిటి సభ్యులుగా నియమించింది. చలనచిత్ర నటుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మురళి పూలగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, తళి, వేపనహళ్లి, బర్గూరు, కృష్ణగిరి, ఊత్తంగరై అసెంబ్లీ స్థానాలను పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి గ్రామస్థాయిలో పర్యటించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

సిలంబంపై విద్యార్థుల అవగహన


ర్యాలీ ప్రారంభిస్తున్న మాస్టర్ వి.నాగరాజ్

హోసూరు : హోసూరులో అంతర్జాతీయ వాకర్డే సందర్భంగా సిలంబం సంఘం ఆధ్వర్యంలో ఆత్మ రక్షణకు కట్టెసాధనపై విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. 200 మంది వీధుల్లో కట్టె సాధన ప్రదర్శన చేస్తూ అవగహన కల్పించారు. హోసూరు రాయకోట రోడ్డులోని ఆర్.వి.ప్రభుత్వ బాలుర హైయర్ సెకండరీ పాఠశాల నుంచి రింగ్ రోడ్డు ద్వారా రాయకోట రోడ్డులోని అశోక పిల్లర్ వరకు ర్యాలీ సాగింది. అంతర్జాతీయ సిలంబం సంఘం కార్యదర్శి మాస్టర్ వి.నాగరాజ్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శబరినాథన్, మాస్టర్ చంద్రు, మాస్టర్ కృష్ణన్, చంద్రశేకర్, వెంకటాచలపలి, నరసింహం, మదన్ తదితరులు పాల్గొన్నారు.

భారీవర్షంతో అస్తవ్యస్తమైన జనజీవనం


బిన్నిపేటలో కూలిన గోడ


మోకాలి లోతులో బైకుపై పయనం


అలీఅస్కర్ రోడ్డులో రహదారిపై పడిన గుంత

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షంతో నగరవాసి జీవనం అస్తవ్యస్తమైంది. కబ్బన్ ఉద్యానం, లాల్‌బాగ్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో 15కు పైగా భారీ వృక్షాలు కూకటి వేళ్లతో సహా నేలకొరిగాయి. యాభైకు పైగా చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. బెస్కాం, జలమండలి పనులు చేసిన పలు ప్రాంతాల్లో నేల కుంగిపోయింది. బిన్నిపేటలో ఒక ఇంటి గోడ, పైకప్పు, ఈటీఏ మాల్ వద్ద ప్రహరీ కూలిపోయింది. ఏడు అడుగుల ఎత్తు, పది అడుగుల పొడవైన గోడ పడడంతో ఇరవైపులా వాహనాలు ధ్వంసమయ్యాయి. యలహంక వలయంలోని కేంద్రీయ విహార అపార్ట్‌మెంట్ ప్లాట్ల ఆవరణలోని వర్షం నీరు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి నాలుగు అడుగుల లోతున్న నీరు, ఆదివారం ఉదయం మోకాలి లోతుకు, మధ్యాహ్నానికి గిలకల లోతుకు చేరుకుంది. యలహంక చుట్టుపక్కల ఉన్న పది చెరువుల నీరు కేంద్రీయ విహార్ ఆవరణలోకి వస్తోందని అధికారులు గుర్తించారు. విజయనగరలోని మధువనలోకీ వర్ష నీరు చేరింది. బ్రాండ్ బెంగళూరు అంటూ ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారానికీ, వర్షం కురిస్తే ఎదురవుతున్న సమస్యలకు పొంతన లేదని ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు ఎద్దేవా చేశారు.


నీటిని తోడుతున్న అగ్నిమాపక సిబ్బంది


పాదచారి మార్గంలో అడ్డంగా బ్యారికేడ్


కబ్బన్ ఉద్యానంలో కూకటి వేళ్లతో విరిగి పడిన వృక్షం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి పరమేశ్వర్, జిల్లాధికారి, తదితరులు

దేశప్రగతిలో మహిళల పాత్ర కీలకం

తుమకూరు, న్యూస్‌టుడే : దేశం అభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని హోం మంత్రి జి.పరమేశ్వర్ అభిప్రాయపడ్డారు. నగరంలోని ఎం.జి.స్టేడియంలో తుమకూరు దసరా వేడుకల్లో భాగంగా ఆదివారం క్రీడా దసరా, మహిళా దసరా రంగవల్లుల పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం వేగవంతంగా ముందడుగు వేస్తోందని, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాత 14 లక్ష మహిళలు వివిధ స్థానిక సంస్థల్లో పాలానాధికారాలు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధిలో మహిళలు తమ శక్తిని చూపారన్నారు. అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఈసందర్భంగా గాంబీర్యగౌడ, తదితరులను సత్కరించారు. తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేశ్, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్, జిల్లాధికారి శుభాకల్యాణ్, పాలికె కమిషనర్ అశ్విజ, సీఈఓ ప్రభు, ఎస్పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


వేదికలో కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే, ఎమ్మెల్యే మునిరాజు

శెట్టిహళ్లిలో భాజపా సభ్యత్వ నమోదు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : దాసరహళ్లి విధాన సభా క్షేత్రం శెట్టిహళ్లి వార్డులో భాజపా సభ్యత్వ నమోదు అభియానాను కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే ప్రారంభించారు. సార్వజనికులు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. సభ్యులకు సభ్యత్వ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దాసరహళ్లి ఎమ్మెల్యే ఎస్.మునిరాజు, భాజపా మండల అధ్యక్షుడు సోమశేఖర్, శెట్టిహళ్లి వార్డు అధ్యక్షుడు సురేష్, పార్టీ కార్యకర్తలు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో లోహిత్‌కు రెండో స్థానం



లోహిత్

బెంగళూరు (మత్తికెరె), న్యూస్‌టుడే : మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్కేటింగ్ పోటీల్లో కర్ణాటక నుంచి పాల్గొన్న పి.లోహిత్ విజయం సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో 12 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. రోడ్డుపై 3 వేల మీటర్ల రోలింగ్ స్కేటింగ్ చేసి విజయాన్ని దక్కించుకున్నట్లు పుష్పలీలా, ప్రకాష్ తెలిపారు. మంచి శిక్షణతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. లోహిత్ చదువుతున్న పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

అలంకారప్రియే.. సమోస్తుతే

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : 'సురా సంపూర్ణ కలశం రుధిరాప్లుతమేవచ, దధానా హస్త పద్మభ్యాం కూష్మాండా శుభదాస్తుమే'. .అంటూ సిద్ధులు, గంధర్వులు దేవతలు, సురులు, మానవులచే కూష్మాండరూపంలో కొలవబడే ఆ ఆదిశక్తి ప్రస్తుతం భూలోకంలో సంచరిస్తోంది. ఆ తల్లిని పాపలా భావించి విభిన్న ఆకారాలలో సింగారించి, అలంకరించి మానవులు పండగ ద్వారా ఆత్మానందాన్ని పొందుతున్నారు. శరన్నవరాత్రుల నాల్గో రోజు మాత ఘనంగా వేదమంత్రాలు, యుక్త పూజలు, ఆరాధనలు అందుకుంటోంది. బెంగళూరుకు ఆరాధ్యదైవమైన బనశంకరి బత్తాయిలు, జామకాయలు, ద్రాక్ష, అనాస, పుచ్చకాయ, యాపిల్, సీమరేగు, నారింజ, దానిమ్మపండ్లు, కివి పండ్లు, తదితర పండ్లతో అలంకృతమై చిరునవ్వులతో భక్తులకు నయనానందం కలిగించింది. గవిపురం గుట్టహళ్లిలో 500 ఏళ్ల క్రితం దట్టమైన బండల మధ్య వెలసిన అమ్మవారు బండే మాంకాళమ్మ పేరుతో పూజలు అందుకుంటోంది. ఈ తల్లి కాస్త కోపంగా గంభీరంగా కనిపించినా ఆదివారం మాత్రం మనసంతా.. తనువంతా నవనీతం చేసుకుని తనని చూడవచ్చిన వారిని కరుణిస్తోంది. ఇక్కడికి కొంత దూరంలో కొలువైన భవానీమాత భువనేశ్వరిగా అవతారమెత్తి అభయ హస్తాన్ని చాచింది. మంగళూరికే అధిష్ఠాన దేవతైన మంగళాదేవి ఆదివారం సింహవాహని, త్రిశూరధారిణిగా దుష్టులను చూసి గర్జిస్తోంది. బనశంకరి దేవి ఆలయంలోనే కొలువైన శాకంబరిదేవి పరమ మంగళాదేవి అలంకారంలో అలరిస్తోంది. బ్యాంక్ కాలనీ లోగల మంజునాథేశ్వరుడి అర్ధాంగి పార్వతి తనువంతా విభిన్న రకాల కూరగాయలను పేర్చుకుని చిరునవ్వులు వలికిస్తోంది. సనాతన గవిగంగాధరేశ్వర దేవస్థానంలో దుర్గాపరమేశ్వరి, హనుమంతనగర్‌లో ప్రసన్న పార్వతి, పద్మావతి అమ్మవార్లు సుందర అలంకారయుక్తులై భక్తులను అలరిస్తున్నారు. ఉదయ వేళల్లో పవమాన హోమాలు, చండీ హోమాలు, వివిధ అభిషేకాలు, వేద మంత్రాలతో పూజలను అందుకుని ఊరేగింపులకు సిద్ధమయ్యారు.


వెన్న అలంకారంలో మహాకాళి


భువనేశ్వరిగా భవానీ మాత


త్రిశూలధారిణిగా మంగళాదేవి


పూజలందుకుంటున్న పార్వతీదేవి

ధర్మస్థలలో నవరాత్రి ఉత్సవాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ధర్మస్థలలో వేలాది భక్తులకు ఆత్మానందం కలిగించే రీతిలో శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రతిరోజు సాయంత్ర సమయాల్లో ప్రముఖ సంగీత, హరికథ క్షయగాన విద్వాంసులచే కచేరీలు నృత్యాలు కథా కాలక్షేపాలు నిర్వహిస్తున్నారు. ప్రవచన మంటపంలో పుత్తూరు గానసిరి కళాకేంద్రానికి చెందిన కిరణ్‌కుమార్ బృందంచే భక్తి సంగీత, వాగ్గేయకారుల కీర్తనల కచేరి వీక్షకులను అలరించాయి. శ్రీలక్ష్మి, సృజన పూజారి, మనస్వి, మాస్టర్ అచిత్ర తమ గాత్రాన్ని జోడించి వన్నెతెచ్చారు. ప్రక్కవాద్య సహకారాన్ని సుదర్శన్ ఆచార్య, దివ్యానిధి అందించి కచేరీని రక్తి కట్టించారు. మంజునాథ దేవస్థానంలో పార్వతీ అమ్మవారికి వైవిధ్యమయ మంత్రోచ్ఛారణలతో పూజాద్రవ్యాలతో అభిషేకాలతో అర్చించి రాత్రి ఘనంగా ఊరేగించారు. ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కళాకారులను ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే అభినందించి సత్కరించారు.


గాయకులచే సంగీత కచేరి

బెంగళూరు బతుకమ్మ సంబరాలు షురూ


బతుకమ్మలో సంఘం సభ్యులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కర్ణాటక తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు గుండాజనేయ స్వామి ఆలయం ఆవరణలో బతుకమ్మ వేడుకలు ఆచరించుకున్నారు. తంగేడు, గునుగు, ఇతర పూలతో తమ బతుకమ్మను సిద్ధం చేసుకుని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు వచ్చారు. సద్దుల బతుకమ్మను అక్టోబరు 10న ఆచరిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం సహకారంతో విద్యారణ్యపుర సంసిద్ధి పాఠశాల ఆవరణలో నిర్వహించే సద్దుల బతుకమ్మలో అన్ని ప్రాంతాల వారు హాజరయ్యేందుకు అవకాశం కల్పించనున్నారు. ఒక ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేలా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామని నిర్వాహక సమితి ప్రతినిధులు తెలిపారు.

జీవనశైలి మార్పులతో ఆరోగ్య సమస్యలు



సమావేశంలో వైద్యులు, సంస్థ ప్రతినిధులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : జీవనశైలి మార్పులు, నడక, కూర్చునే విధానాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఎక్కువ సమయం కూర్చుని పని చేసేవారు వివిధ రకాల నొప్పులతో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇపియోన్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సుధీర్ దారా తెలిపారు. బెంగళూరులో తమ మొదటి వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఏడాదిలో తాము 1300 మందికి ఉత్తమ చికిత్సలు అందించామని చెప్పారు. కంప్యూటర్ ముందు కూర్చుని పని చేసేవారికి వేళ్లు, నడుము, పాదాలు, వెన్నునొప్పితో బాధపడుతున్నారని తెలిపారు. ప్లాస్మాథెరపీతో పాటు, కూర్చునే భంగిమలో మార్పులు, పని మధ్యలో కొంత సమయం చిన్న వ్యాయామాలు చేయడం ద్వారా సమస్యను అధిగమించవచ్చని వివరించారు. వార్షికోత్సవంలో సంస్థ వైద్యురాలు విద్యాభండార్, సిబ్బంది పాల్గొన్నారు.

దసరాకు అదనంగా రెండువేల బస్సులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దసరా పండగ సెలవులు రావడంతో సొంత ఊర్లకు వెళ్లే ప్రజల కోసం కె.ఎస్.ఆర్టీసీ అదనంగా వివిధ ప్రాంతాలకు రెండు వేల బస్సులు నడపనుంది. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు అదనపు బస్సులు రాష్ట్రం లోపల, ఇతర రాష్ట్రాలకు సంచరిస్తాయని అధికారులు తెలిపారు. నగరం నుంచి 13, 14వ తేదీల్లో ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. మైసూరు దసరా ఉత్సవాలు వీక్షించేందుకు 660 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించారు.

క్రీడల్లో రాణిస్తున్న మహిళలు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : మహిళలు కేవలం కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొంటూ రాణిస్తున్నారని నటి అశ్వినిగౌడ తెలిపారు. ఆదివారం ఇక్కడ శరణ సంస్కృతి ఉత్సవాల్లో భాగంగా మహిళల తాడులాగే (టగ్ ఆఫ్ వార్) పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు మానసిక, శరీరక ఆరోగ్యం కాపాడుకోవడానికి ఆటలు అవసరమన్నారు. తరచూ నడక ప్రాక్టీస్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బసవమూర్తి మాదార చెన్నయ్య స్వామి, బసవకుమారస్వామి, నగరసభ కమిషనర్ రేణుక తదితరులు పాల్గొన్నారు. 200 మంది మహిళలు క్రీడల్లో పాల్గొన్నారు.


తాడులాగే పోటీలను ప్రారంభిస్తున్న నటి అశ్వినిగౌడ, స్వామీజీ, అధికారులు

క్రైమ్.. కార్నర్

పోరాడి ఓడిన హమాలీ మంజునాథ


మంజునాథ

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని కణివెణహళ్ళి గ్రామానికి చెందిన వాల్మీకి మంజునాథ (47) హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. సెప్టెంబరు 20వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. తుమకూరులోని సిద్ధగంగా ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం శనివారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. 15 రోజులు మృత్యువుతో పోరాడి మృతి చెందాడు. మంజునాథ మృతితో భార్య పద్మావతి, కుమారుడు నితేశ్ (12) కూతురు శ్వేత (10) దిక్కులేని వారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

బెంగళూరు (యశ్వంతపుర), : వివేకానగర పోలీసురాణా పరిధిలో నివసిస్తున్న కుందాపుర నివాసి టెక్కి మేఘనాశెట్టి (27) ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివేకానగరలో భర్త సుదీప్‌శెట్టితో కలిసి ఉంటున్నారు. రెండేళ్ల కిందట వీరికి వివాహం కాగా ఒక కుమార్తె ఉంది. నగదు వ్యవహారంపై ఇద్దరి మధ్య తరచు గొడవ పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భర్త ఫిర్యాదు చేయగా, వరకట్నం వేధింపులకు గురి చేసి తమ కుమార్తెను హత్య చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు.

నీట మునిగి విద్యార్థి మృతి

కార్వార, న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి మురుడేశ్వర పర్యటనకు వెళ్లిన గౌతమ్ (17) అనే విద్యార్థి అరేబియా సముద్రంలో మునిగి ఆదివారం మృతి చెందాడు. మరో విద్యార్థి ధనుష్‌ను తీర ప్రాంత రక్షణదళ సభ్యులు రక్షించారు. విద్యాసౌధ పీయూ కళాశాలకు చెందిన 200 మంది విద్యార్థులు మురుడేశ్వర పర్యటనకు వచ్చారు. సముద్రం నీటిలోకి దిగవద్దని చెబుతున్నా గౌతమ్, ధనుష్ ముందుకు వెళ్లారు. అలలు లోపలకు లాక్కోవడంతో ప్రమాదం సంభవించింది. మురుడేశ్వర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వికటించిన శస్త్రచికిత్స

రామనగర, న్యూస్‌టుడే : ఒకే వృషణంతో పుట్టిన ఆర్య (6) అనే బాలునికి శ్రీదేవి మిషన్ ఆసుపత్రిలో నిర్వహించిన శస్త్రచికిత్స వికటించి ఆదివారం మరణించాడు. వైద్యుల నిర్లక్ష్యం, మత్తు ఎక్కువ కావడంతోనే తమ కుమారుడు చనిపోయాడని ఆర్య తల్లిదండ్రులు ఆరోపించారు. శస్త్రచికిత్సకు ముందు ఆరోగ్యంగా ఉన్న తమ కుమారుడు, అనంతరం చనిపోయాడని ఆక్రోశించారు. రామనగర ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్తిక్‌రెడ్డి ఆసుపత్రి వద్దకు వచ్చి బాధితులను పరామర్శించారు.

బంగారు గొలుసు చోరీ

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రహదారిపై నిలబడి ఉన్న మహిళ మెడలో ఉన్న పదిగ్రాముల బంగారు గొలుసును నిందితులు లాక్కుని పరారైన సంఘటన శనివారం రాత్రి చంద్రలేఔట్ పోలీసురాణా పరిధిలోని నాగరభావి కూడలిలో జరిగింది. ఈమేరకు బాధితురాలు హనుమంతనగర నివాసి రేఖ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి 8 గంటల సమయంలో నాగరభావి కూడలిలో స్నేహితురాలి కోసం నిలబడింది. అక్కడికి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరి నిందితులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యకు ప్రత్యేక గౌరవం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : విద్యార్థులు ఉత్తమ విద్యావంతులై ఉన్నతశిఖరాలు అధిరోషించినపుడే విద్యకు గౌరవం లభిస్తుందని ఎస్‌డీఎం విద్యాసంస్థల కార్యదర్శి ధర్మస్థల డి.హర్షేంద్రకుమార్ తెలిపారు. ధర్మస్థల ఉజిరేలోని ఇంద్రప్రస్థ సభాప్రాంగణంలో సువర్ణ మహోత్సవం-సువర్ణ సమ్మిళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ, శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రవి కటపాడి, ఉజిరేకు చెందిన మోహన్‌కుమార్‌లకు సువర్ణ సేవారత్న పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు ప్రతాప్‌లింగయ్య, కుమారహెగ్డె, శేషప్ప అమీన్, ఎస్.డీ.ఎం విద్యా ఎస్.సతీశ్చంద్ర, నిక్షిత్, దీపా, మహేష్‌కుమార్ శెట్టి, దీపా తదితరులు పాల్గొన్నారు.


మహోత్సవంలో హర్షేంద్రకుమార్, ప్రతాప్‌లింగయ్య తదితరులు


పరిశ్రమల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలు

హరిత న్యాయస్థానం నోటీసులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బెంగళూరు, మంగళూరు, మైసూరు నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం ఎక్కువగా ఉందని హరిత న్యాయమండలి గుర్తించింది. ఇతర ప్రాంతాలతో పోల్చితే ఇక్కడ ఐదు రెట్లు ఎక్కువ కాలుష్యం ఉందని గ్రీన్‌పీస్ సంస్థ నివేదిక ఆధారంగా మండలి గుర్తించింది. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, తాగునీటి వనరులు ఎక్కువగా ఉన్న చోట్ల నిర్వహిస్తున్న పరిశ్రమలకు నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

లాహిరి లాహిరి..లాహిరిలో..



దసరా ఉత్సవాల్లో భాగంగా తుమకూరులో అమానిచెరువులో విహారయాత్రను ప్రారంభమైంది. మంత్రి పరమేశ్వర్, ఆయన సతీమణి కన్యకా పరమేశ్వర్, జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎమ్మెల్యే జ్యోతిగణేష్, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్, పాలికె కమీషనర్ అశ్విజ, సీఈఓ ప్రభు, ఎస్పీ అశోక్ తదితరులు పడవలో విహరించారు.

- తుమకూరు, న్యూస్‌టుడే

నిర్మాణరంగంలో మార్పులు

బెంగళూరు (యశ్వంతపుర): ఆధునిక సమాజంలో నిర్మాణంలో మార్పులకు తగినట్లు ఫైఉడ్ నాణ్యతలో రాజీ పడటం లేదని డ్యూరోపై సంస్థ ఎండీ అఖిలేశ్ చిట్లాంగియా తెలిపారు. ఫైఉడ్ రంగంలో ఎన్నో సంస్థలు నుంచి వస్తున్న డై చేసిన వెనీర్‌లు, ఇటలీ ఆర్కిటెక్చర్‌లకు అనుగుణంగా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నేచర్స్ సిగ్నేచర్ బ్రాండ్లను విడుదల చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

కార్యకర్తల పథసంచలనం


కవాతు చేస్తున్న కార్యకర్తలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: శరన్నవరాత్రులను పురస్కరించుకుని హెబ్బాళ విభాగం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు నాగవార ప్రాంతంలో ఆదివారం కవాతు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ 1925 ఏడాది విజయదశమి సందర్భంలో ఏర్పాటైంది. అప్పటి నుంచి పండగ సమయంలో గణవేషధారణలో కవాతు చేస్తూ వస్తున్నామని సంఘపరివార్ నాయకులు తెలిపారు. నాగవార మైదానంలో ప్రార్థన అనంతరం 500మందికి పైగా కార్యకర్తలు పథసంచనలంలో పాల్గొన్నారు. దారి మధ్యలో హిందూ సంఘాల ప్రతినిధులు, భాజపా కార్యకర్తలు వారిపై పూలరేకులు చల్లి స్వాగతించారు.

రైతులను ఆదుకోవాలని సీఎంకు వినతి

రాయచూరు, న్యూస్‌టుడే : అతివృష్టితో మిరప, పత్తి, కంది, సజ్జ పంటలను కోల్పోయిన జిల్లా రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని, విద్యుత్తు నియంత్రికలకు ఉచితంగా స్తంభాలు, తీగలు ఇచ్చే విధానాన్ని పునరుద్ధరించాలని, అటవీ భూములు సాగు చేస్తున్న పట్టాలు అందజేయాలని జిల్లా రైతు సంఘం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణగౌడ కడగందొడ్డి నేతృత్వంలో అన్నదాతలు శనివారం సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. నారాయణపుర కుడి కాలువ నిర్మాణం కోసం భూములను స్వాధీనం చేసిన రాయచూరు తాలూకాలోని కొత్తదొడ్డి నుంచి బూర్దిపాడు వరకు ఉన్న గ్రామాల రైతులకు పరిహారం చెల్లించాలని, తుంగభద్ర ఎడమకాలువ పరిధిలో అక్రమంగా నీటిని సేకరించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

క'ర్ణాటక'లో కక్షపూరిత రాజకీయం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: కర్ణాటకలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ముడా నుంచి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి అక్రమంగా 14 ఇంటి స్థలాలను పొందారని, ఆయన పదవికి రాజీనామా చేసి, విచారణకు హాజరు కావాలంటూ భాజపా, దళ్ డిమాండ్ చేశాయి. బెంగళూరు నుంచి మైసూరు వరకు పది రోజులకు పాటు పాదయాత్ర చేసి హడావిడి చేశాయి. మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ముడా నుంచి భూములు తీసుకున్నారని, డీనోటిఫికేషన్‌కు సంబంధించి లోకాయుక్త ముందు కేసులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కుమారస్వామి సైతం తన పదవికి రాజీనామా చేసి విచారణకు హాజరు కావాలంటూ కాంగ్రెస్ ఆందోళనకు దిగడంతో ఆయన తన స్వరాన్ని మార్చారు. సిద్ధరామయ్యను రాజీనామా చేయాలని తాను ఎన్నడూ డిమాండ్ చేయలేదని, విచారణను ఎదుర్కోవాలని మాత్రమే సూచించానని చెప్పేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. రాష్ట్ర భాజపాతో కొద్ది రోజులుగా సమావేశాల్లో పాల్గొంటూ వచ్చిన కుమార ప్రస్తుతం ఇక్కడి నేతలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ అధిష్ఠానం అండగా ఉండడంతో సిద్ధరామయ్య ధీమాతో పాలన కొనసాగిస్తున్నారు. ఆయనే ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ప్రకటించారు. మంత్రులు ఎంబీ పాటిల్, జమీర్ అహ్మద్ ఖాన్‌లు వంత పలికారు.

సీఎం మార్పు అంటూ..

ముఖ్యమంత్రి మారే అవకాశం ఉందన్న నమ్మకంతో మంత్రులు పరమేశ్వర్, సతీశ్‌జార్ఖిహోళి తదితరులు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయి వచ్చారు. దళిత ముఖ్యమంత్రికి అవకాశం వస్తుందని కొద్ది రోజులుగా ప్రచారం జరిగింది. ఇవేమీ తనకు సంబంధించిన అంశం కాదన్నట్లు సిద్ధరామయ్య మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించారు. వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారు. సిద్ధరామయ్యతో పాటు మంత్రులు జమీర్ అహ్మద్ ఖాన్, భైరతి సురేశ్, రాజణ్ణ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి.





వారిపైనా కేసులు వేసేందుకు సహ కార్యకర్తలు, భాజపా నాయకులు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరోవైపు శాంతినగర ఎమ్మెల్యే ఎన్‌ఏ హ్యారిస్ ఎన్నికల ప్రమాణ పత్రంలో తప్పుడు వివరాలు నమోదు చేశారని ఆయనపై ఓడిపోయిన భాజపా అభ్యర్థి సుప్రీంకోర్టులో కేసు వేశారు. హైకోర్టులోనే సమస్యను పరిష్కరించుకోవలని సూచించడంతో దర్యాప్తు మళ్లీ ఇక్కడకే వచ్చింది. ఈ నెల 8న కేసు విచారణకు రానుంది. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ఎలాంటి తప్పు చేయలేదంటూ దళ్ నేత, మాజీ మంత్రి జీటీ దేవేగౌడ వ్యాఖ్యలు చేయడంతో ఆ పార్టీ నేతలు కంగుతిన్నారు.

దళ్ దారెటు?

సిద్ధరామయ్య అంశం కన్నా దళ్ నేతలు ఇప్పుడు ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్, తమ పార్టీ పూర్వనేత, భూ వ్యాపారి విజయ్ టాటాపై ఆరోపణలు చేసి, వారిపై పోరు ప్రకటించింది. హరియాణా, జమ్ము కశ్మీరు ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని తన ప్రసంగాలలో పేర్కొన్న ప్రధాని మోదీ, మళ్లీ ఇప్పుడు దానిపై నోరు మెదపలేదు. కర్ణాటకలో మూడు చోట్ల ఉప ఎన్నికల తేదీలను త్వరలో ప్రకటించనున్నారు. ఈ సమయంలో ఆరోపణలు చేస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందని కాషాయ పార్టీ నేతలు యోచిస్తున్నారు. చెన్నపట్టణ నుంచి నిఖిల్ పోటీ చేస్తారని ఇప్పటికే పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీ చేస్తానని మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ ప్రకటించారు. ఈ విషయంలోనూ కాషాయ పార్టీతో దళ్ నేతలకు దూరం పెరిగే అవకాశం ఉంది.



హైకోర్టు ఆదేశాలతో మైసూరు లోకాయుక్తలో ముఖ్యమంత్రి, ఆయన భార్య, బావమరిది, వారికి స్థలం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదైంది. అక్రమాలకు సంబంధించి లోకాయుక్త అధికారులు ఆదివారం కూడా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఏవైనా ఆధారాలు దొరికితేనే ముఖ్యమంత్రిని విచారణకు హాజరు కావాలని పిలిచే అవకాశం ఉంది. ముందుగా స్థలం విక్రయించిన వ్యక్తిని, సిద్ధరామయ్య బావమరిదిని విచారణకు పిలిచే అవకాశం ఉంది. విజయదశమి పూర్తయ్యేలోగా విచారణకు పిలుస్తారని భాజపా ధీమాతో ఉంది. ఉప ఎన్నికల తేదీలను ప్రకటించిన అనంతరం విచారణకు పిలిస్తే కేంద్రం కక్షసాధింపులకు దిగిందని అధికార పార్టీ ఆరోపిస్తుందన్న అనుమానం కాషాయ పార్టీ నేతల్లో గుబులు మొదలైంది. మరో వైపు భాజపాలో రెండో శక్తికేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రమేశ్ జార్ఖిహోళి, యత్నాళ్, అరవింద లింబావళి తదితరులు ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యుత్తు కాంతులు ప్రసరింపజేస్తాం


మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు, న్యూస్‌టుడే : నగరమంతా విద్యుత్తు దీపాలను అమర్చి కాంతులు ప్రసరింపజేస్తామని చిన్న నీటిపారుదల, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి బోసురాజు హామీ ఇచ్చారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి నిధి రూ.2.5 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 1960 ఎల్‌ఈడీ వీధి దీపాలను ఆదివారం మంత్రి కార్యాలయంలో నగరసభ అధికారులకు అందజేశారు. విద్యుత్తు స్విచ్ నొక్కి దీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 35 వార్డుల్లోని ప్రతి కాలనీలో దీపాలు వెలిగిస్తామని తెలిపారు. అవసరమైతే అదనంగా నిధులను మంజూరు చేయించి లైట్లు వేయిస్తామని భరోసా ఇచ్చారు. రాయచూరును పచ్చదనం, పరిశుభ్ర నగరంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నానని వెల్లడించారు. నగరసభ ఉపాధ్యక్షుడు సాజీద్ సమీర్, కౌన్సిలర్లు జయణ్ణ, రమేష్, జిందప్ప, నరసరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.శాంతప్ప, శివమూర్తి, నరసింహులు మాడగిరి, తేజప్ప హాజరయ్యారు.

ఉప ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం


విలేకర్లతో మాట్లాడుతున్న శివరాయ్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు దళితుల వర్గీకరణకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చొరవ చూపాలని, సాకులు చెబుతూ జాప్యం చేస్తే శిగ్గాం, చెన్నపట్టణ, సండూరు విధానసభ ఉప ఎన్నికల్లో గుణపాఠం చెప్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్రవ్యవస్థాపక శివరాయ్ హెచ్చరించారు. ఆయన ఆదివారం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతర్గత రిజర్వేషన్లు కల్పించే విషయమై కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడుతామని, మంత్రి వర్గ సమావేశంలో చర్చిస్తామని సీఎం పేర్కొనడం శోచనీయమన్నారు. ఇది వరకే క్యాబినెట్ సమావేశంలో ఆమోదించి, కేంద్రానికి సిఫార్సు చేశారన్నారు. ఈ విషయం విధానసభ ఎన్నికల ప్రణాళికలో ఉందని, అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని చిత్రదుర్గం సభలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎలాంటి చర్చలు చేయకుండా జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అడ్డుపడుతుంటే ఆ సంగతి బహిరంగ పరచాలని ఒత్తిడి తెచ్చారు. రాయచూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి దళిత నాయకులను మాట్లాడనివ్వకుండా పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారని ఆరోపించారు. సమావేశంలో ప్రతినిధులు హేమరాజ అస్కిహాళ్, శ్రీనివాస కలవలదొడ్డి, శ్రీనివాస కొప్పర పాల్గొన్నారు.

'నేను టాటా చెప్పి వెళ్లిపోను'

రామనగర, న్యూస్‌టుడే : నేను టాటా చెప్పి వెళ్లిపోయే నాయకుడిని కాదంటూ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్‌లను ఉద్దేశించి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. చెన్నపట్టణలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో తన కుమారుడు నిఖిల్‌తో కలిసి మాట్లాడారు. చెన్నపట్టణ నుంచి తనను పలుసార్లు గెలిపించిన ఓటర్లకు తాను ఎప్పుడూ రుణపడే ఉంటానని చెప్పారు. ఎన్నికలు ముగిసినా, ఇప్పటికీ తన కుమారుడు నిఖిల్ ఓటర్ల మధ్యలో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తున్నాడని తెలిపారు. మండ్య, రామనగర, హాసన, మైసూరు జిల్లాలలో మొదటి నుంచి దళ్‌కు ఉన్న పట్టును కోల్పోయేందుకు సిద్ధంగా లేమన్నారు. త్వరలో ఉప ఎన్నికల తేదీలను ప్రకటిస్తారని, ఆ లోగా ఇక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థిని భాజపాతో కలిసి ప్రకటిస్తామని చెప్పారు. ఎన్నికలు ఉన్నాయని వచ్చి వెళ్లే వారు ఎవరో, ఎప్పటికీ మీతో కలిసి ఉండేవారు ఎవరో తెలుసుకోవాలని ఓటర్లను కోరారు.


వేదికపై కుమారస్వామి, నిఖిల్

భారీగా అన్నదానం


అన్నసంతర్పణ చేస్తున్న ఆల్దాళ వీరభద్రప్పగౌడ

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాన్వి పర్యటన విజయవంతమైంది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం కనిపిస్తుంది. యువ కాంగ్రెస్ నాయకుడు రవిబోసురాజు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించటమేనని ఇందుకు కారణమని చెప్పవచ్చు. సీఎం సభలో ముఖ్య ఘట్టం భోజన వ్యవస్థ. సీఎం సభకు 50 వేల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. సభకు వచ్చిన ప్రజలు భోజనం చేసేందుకు ప్రత్యేక టెంట్లు ఏర్పాట్లు చేశారు. వచ్చిన వారికి భోజన సదుపాయ వ్యవస్థను పట్టణానికి చెందిన ప్రముఖ వర్తకుడు ఆల్దాళ వీరభద్రప్పగౌడ చేపట్టారు. ఆయనే దగ్గిరుండి అన్నసంతర్పణ చేశారు. చేపట్టారు. పోలీసులతో సహ ప్రతి ఒక్కరూ భోజనం చేశారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

మాన్వి, న్యూస్‌టుడే : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంలో అమేచర్ కబడ్డీ సంఘం ఏర్పాటు చేసినట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు రవికుమార్‌పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏపీఎంసీ యార్డులో జిల్లా స్థాయి ప్రోకబడ్డీ క్రీడ ప్రారంభంలో మాట్లాడారు. 4 బాలుర, 4 బాలికల కబడ్డీ బృందాలు పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ, ప్రముఖులు తిమ్మారెడ్డి భోగావతి, అక్బర్‌సాబ్, రామచంద్రనాయక్, బాలస్వామి కొడ్లి, శివరాజ్ నాయ్, ఎం.ప్రవీణ్ కుమార్, వీరేశ్ నాయక్, శివరాజ్, శరణప్ప మేదా, క్రీడాభిమానులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న కల్మఠ స్వామీజీ

చలువాది పోరాటాన్ని భాజపా గుర్తించింది

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: అణగారిన వర్గాల శ్రేయస్సుకు పోరాటం చేస్తున్న చలువాది నారాయణ స్వామిని భాజపా గుర్తించి రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. పార్టీలో నాయకునిగా, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తూ తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారని అభినందించారు. చలువాది నారాయణ స్వామి దంపతులను ఆదివారం ఇక్కడ సత్కరించి మాట్లాడారు. యడియూరప్ప, అనంతకుమార్ తదితర నాయకులు నగరాల నుంచి గ్రామాలకు భాజపా సిద్ధాంతాన్ని తీసుకువెళ్లారని, వారి అడుగుజాడలను ప్రతి నాయకుడు, కార్యకర్త అనుసరించవలసి ఉందన్నారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయం చేయడం కన్నా, నాయకుడిగా ఆయన సూచించిన మార్గంలో తాను ప్రయాణిస్తున్నానని తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ పేరు చెప్పుకొని ఆరు దశాబ్దాలు రాజకీయం చేసిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను వంచిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో పోరాటాలు చేస్తూ నాలుగు దశాబ్దాల పాటు అనాథ శిశువుగా ఉన్న తనను భాజపా గుర్తించి, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని చలువాది నారాయణ స్వామి తెలిపారు.


చలువాది నారాయణస్వామి దంపతులను సత్కరిస్తున్న బీఎల్ సంతోశ్, విజయేంద్ర

పురస్కారంతో మరింత బాధ్యత

రాయచూరు, న్యూస్‌టుడే : మున్నూరు కాపు సమాజం ప్రముఖుడు, మాజీ ఎమ్మెల్యే ఎ.పాపారెడ్డి అంతర్జాతీయ స్థాయి ఐకాన్ లెజండ్ పురస్కారం అందుకోవడం గర్వంగా భావిస్తున్నామని మంత్రి బోసురాజు పేర్కొన్నారు. గత నెల హైదరాబాద్‌లో పురస్కారాన్ని స్వీకరించిన రెడ్డికి మున్నూరు కాపు సమాజం ఆదివారం స్థానిక వీరాంజినేయస్వామి కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ లెజండ్‌గా ఎంపిక కావడం అంత సులభం కాదన్నారు. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన ఈ సామాజికవర్గం ప్రముఖులు, అధికారులు సమక్షంలో అందుకోవడం హర్షణీయమన్నారు. సుదీర్ఘకాలంగా అందించిన సామాజిక, ఆధ్యాత్మిక సేవలను పరిగణించి సిఫార్సు చేస్తారని తెలిపారు. పాపారెడ్డి నాయకత్వంలో గత 24 ఏళ్లుగా నిర్వహించిన ఖరీఫ్ సాంస్కృతిక పండగ పోటీలు దక్షిణాది రాష్ట్రాల్లో గుర్తింపు పొందాయన్నారు. కాపు సమాజాన్ని బలోపేతం చేయడంలో ఆయన శ్రమను గుర్తించారని తెలిపారు. 1978లో తాము ఇద్దరూ రాజకీయాల్లోకి ప్రవేశించామని చెబుతూ రెడ్డికి ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా అధిగమించి నిలదొక్కుకున్న నాయకుడని కొనియాడారు. గ్రామీణ కళలకు జీవం పోస్తూ, పేదల సమస్యలపై స్పందిస్తూ, ప్రజా పోరాటాల్లో పాల్గొంటున్న ఈయన ఎప్పటికీ జిల్లా ఐకాన్ లెజండ్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయుల సామాజిక వర్గం వారు నేటికీ పేరు ప్రఖ్యాతలు గడిస్తున్నారని చెప్పటానికి పాపారెడ్డి ఒక ఉదాహరణ అన్నారు. పాపారెడ్డి మాట్లాడుతూ లెజెండ్ ప్రశస్తి తీసుకుంటానని ఊహించలేదన్నారు. నిస్వార్థంతో సేవా కార్యక్రమాలు చేసే వారికి ఏనాటికైనా గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ సన్మానంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ వసంత్‌కుమార్, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు బెల్లం నరసరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బసవరాజరెడ్డి, ప్రముఖులు కృష్ణమూర్తి, పుండ్ల రాజేంద్రరెడ్డి, ఎన్.శ్రీనివాసరెడ్డి, కేశవరెడ్డి, రామణ్ణ, గుడిసె నరసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉదయం పాపారెడ్డిని ఆయన ఇంటి వద్ద నుంచి టాపు లేని జీపులో కల్యాణ మంటపం వరకు ఘనంగా ఊరేగించారు.


సన్మానం స్వీకరించిన పాపారెడ్డి


ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

తాప, జల కేంద్రాల్లో పుంజుకున్న విద్యుదుత్పాదన

రాయచూరు, న్యూస్‌టుడే : గత నెలలో కర్ణాటకలోని తాప కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పాదన పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నెలలో క్రమేపీ పుంజుకుంటోంది. ఒక్క ఉడుపి కేంద్రంలో మాత్రమే సున్నా ఉత్పత్తి దాఖలైంది. తద్వారా కర్ణాటక విద్యుత్తు నిగమ 1200 మెగావాట్లను కోల్పోయింది. రాయచూరు, బళ్లారి, యరమరాస్, జిందాల్‌లో మెరుగు పడింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయానికి.. రాయచూరులోని ఎనిమిది యూనిట్లలో ఒకటి, నాలుగు, ఆరు స్తంభించాయి. మిగిలిన ఐదు యూనిట్లలో 846 మెగావాట్లను తీస్తున్నారు. ఈ కేంద్రం మొత్తం సామర్థ్యం 1720 మెగావాట్లు. సగానికి పైగానే ఉత్పాదన ఆగిపోయినా మంచి పరిణామంగానే భావిస్తున్నారు. బళ్లారిలోని మూడు యూనిట్లు రన్నింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ 1700 మెగావాట్లకు గానూ 1018 మెగావాట్లను తయారు చేస్తున్నారు. యరమరాస్‌లోని రెండు యూనిట్లలో ఒకటోది ఆగిపోయింది. 1660 మెగావాట్ల సామర్థ్యం ఉన్న దీనిలో 358 మెగావాట్ల ఉత్పత్తి అవుతోంది. జిందాల్‌లో 1460 మెగావాట్లకు బదులుగా 452 మెగావాట్లు సాధ్యపడుతోంది. ఐదు కేంద్రాల ద్వారా నిత్యం 7680 మెగావాట్ల లక్ష్యం ఉంది. కానీ 2674 మెగావాట్ల ఉత్పాదన నమోదైంది. గృహ వినియోగం తగ్గింది. అయినా అనధికృత విద్యుత్తు కోతలు విధించడం గమనార్హం.


ఉడుపి థర్మల్ కేంద్రం


జలాశయాల్లో సంవృద్ధిగా..

నిరుడు సరాసరి వానలు కురవక ఇదే సమయంలో జల కేంద్రాల్లో విద్యుత్తు అంతంతే తయారైంది. ఈ సారి బాగా పుంజుకుంది. శరావతిలో 988 మెగావాట్లు, నాగజహరిలో 585, వారాహిలో 229, ఆలమట్టిలో 166, కాద్రాలో 141, కొడసల్లిలో 115, గేరుసుప్పాలో 103, సూపాలో 101 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు. జోగ్‌లో 70, మునీరాబాద్‌లో 37, ఎల్‌పీహెచ్‌లో 26, శివసముద్రంలో 9, షింషాలో మూడు, బాద్రాలో రెండు మెగావాట్లను తీస్తున్నారు. మణిడ్యామ్, ఘటక ప్రభలో ఉత్పత్తిని నిలిపివేశారు. మొత్తం 2575 మెగావాట్లు బయటకి వస్తోంది.

ఆర్టీసీ సమస్యలపై నేడు ఫోన్-ఇన్

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రయాణికుల, విద్యార్థుల రవాణా సంబంధమైన సమస్యలను ఆలకించేందుకు సోమవారం (నేడు) ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రాయచూరు ఆర్టీసీ విభాగం అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. బస్సుల కొరత, ఇతర ఇబ్బందుల గురించి తెలియజేసి పరిష్కారం పొందాలని కోరారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య చరవాణి 6366423883 సంఖ్యకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా తొలి సోమవారం ఫోన్-ఇన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

శోభాయమానంగా ఆలయాలు


నిజలింగప్ప కాలనీలో మీనాక్షి రూపం


ముత్యాలమ్మకు విశేష అలంకరణ

రాయచూరు, న్యూస్‌టుడే : శక్తి స్వరూపిణి ఆలయాలు శరన్నవరాత్రుల ఉత్సవాల్లో శోభిల్లితున్నాయి. నాలుగో రోజైన ఆదివారం సెలవు కావడంతో నగరంలోని అమ్మవారి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే దర్శనానికి తరలి వచ్చారు. భక్తులు అర్చనలు చేయించి మొక్కుబళ్లు తీర్చుకున్నారు. బ్రహ్మ ముహూర్తంలో అర్చకులు దేవతా మూర్తులను సుందరంగా అలంకరించారు. ఒక్కో రోజు ఒక్కో రకంగా అమ్మలగన్న అమ్మను ఆకర్షణీయంగా ముస్తాబు చేస్తున్నారు. లోకమాత దివ్య స్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి పరవశిస్తున్నారు. నిజలింగప్ప కాలనీ మిలీయనం ఉద్యానవనంలోని భ్రమరాంభ మీనాక్షిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. కాలనీ ప్రముఖుడు సూర్యదేవర నాగేశ్వరరావు తదితరులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. గూడ్స్‌షెడ్ ప్రాంతంలోని ముత్యాలమ్మ దేవిని మల్లె పూలు, చెండుపూలతో అలంకరించారు. బెస్తవారి పేట ఉప్పారవాడిలోని లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. అన్ని లోకాలను తన భుజ స్కందాలపై మోస్తున్న పరమ పావన మయుడు ఆది నారాయణుడు శనివారం రాత్రి ఆంజనేయ వాహనంపై పురవీధుల్లో సంచరించారు. మురిపిస్తూ, మరిపిస్తూ, మై మరిపిస్తున్న ఏడుకొండల వాడిని చూసి భక్తులు చేతులెత్తి నమస్కరించారు. అనంతరం తొట్టెలసేవ చేశారు. సంగీతం, కీర్తనలు ఆలపించారు. దేవాలయ ప్రాంగణాలు ఉదయం, సాయంత్రం రద్దీగా కన్పించాయి.


ఉప్పారవాడిలో ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు

మాన్వి, న్యూస్‌టుడే : మాన్వి పట్టణంతో పాటు మాన్వి, సిరివార తాలూకాల్లోని వివిధ క్యాంపుల్లో శరన్నవరాత్రి పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్ల విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలకు రోజువారీ అలంకరణలు చేస్తున్నారు. మహిళా భక్తులు ఆలయాలకు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించుకుంటున్నారు. శరన్నవరాత్రి నాల్గో రోజు ఆదివారం నీర్‌మాన్వి, కస్బేక్యాంపుల్లోని దేవాలయాల్లో అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.


లితా త్రిపురసుందరీదేవి అలంకారం

కల్మఠంలో ఘనంగా ఒడినింపే కార్యక్రమం

మాన్వి, న్యూస్‌టుడే : శరన్నవరాత్రిలో భాగంగా కల్మఠంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజూ కల్మఠంలో దేవీపురాణాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మహిళల ఒడి నింపే కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా జరిపారు. కల్మఠ మహిళా భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు.


మహిళ ఒడినింపుతున్న ముత్తైదువ

విపక్షాలను దూషించడం మీకే చెల్లింది

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ముడాలో అక్రమంగా ఇళ్ల స్థలాలను పొందిన మీ భార్య విషయంలో విచారణ జరుగుతుంటే ఆ నేరాన్ని విపక్షాలపై తోసివేయడం సరికాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హితవు పలికారు. మీ భార్యను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు ఆరోపణలు చేయడం లేదని గుర్తు చేశారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ 15 నెలల పాలనకు, తన 14 నెలల పాలనకు సంబంధించి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మీరు బహిరంగ చర్చలో పాల్గొనేందుకు సిద్ధమా అని సిద్ధరామయ్యకు సవాలు విసిరారు. 'ప్రభుత్వాన్ని గాని, మిమ్మల్నిగాని చూసి ఎవరూ భయపడడం లేదు. మీరంటే నాకెందుకు భయం. మాజీ ప్రధాని దేవేగౌడ ఇచ్చిన అవకాశాలతోనే మీరు రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మీ భార్యకు ఇళ్ల స్థలాల విషయంలోకి మీరే లాక్కొని వచ్చి, ఇప్పుడు విపక్షాలు తప్పు చేయాలని వ్యాఖ్యలు చేయడం సరికాదు' అన్నారు. మీకు సమస్య వచ్చినప్పుడల్లా ప్రతిసారీ అహిందా తనవెంటే ఉందని అని మాట్లాడడం సరికాదన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలతో మీ ప్రభుత్వానికి అహింద ఎప్పుడో దూరం అయ్యిందన్నారు. అహిందకు మీ ప్రభుత్వం ఇచ్చిన గౌరవం, జారీ చేసిన పథకాలు ఏమున్నాయని ప్రశ్నించారు. మీ భావోద్వేగాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే ప్రయోజనం లేదన్నారు. రాజకీయ నాయకులు చేసే తప్పులైనా, అభివృద్ధి పనులైనా ప్రజలు ఆమోదిస్తారా లేదా అని తెలుసుకునేందుకు ఎప్పుడైనా కొంత సమయం వేచి ఉండవలసి వస్తుందన్నారు. బెంగళూరులో భారీ వర్షం కురిస్తే ప్రజా జీవితం అస్తవ్యస్తం అవుతుందని, ముందు ఆ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

06-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1616.17
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,662	4,437
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,422	9,572
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	52.740

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నీటి తొట్టిలో విషం కలిపిన దుండగుడు

లింగసుగూరు, (మాన్వి) : ప్రజలు తాగే నీటి తొట్టిలో గుర్తు తెలియని దుండగుడు విషం పోసిన సంఘటన ఇది. తాలూకాలోని రోడలబండ గ్రామ పంచాయతీ పరిధిలోని తవగ గ్రామంలో ఈ దారుణం చోటు చేసుకుంది. కుళాయిలకు నీటిని విడుదల చేసే ఆదెప్ప తొట్టి నుంచి కుళాయిలకు నీరు విడుదల చేశాడు. నీరు కడవల్లో నింపుకునేటప్పుడు వాసన రావటంతో గ్రామానికి చెందిన వీరభద్రప అనే వ్యక్తి కొద్దిగా నీరు తాగారు. ఆయనకు వికారం అనిపించింది. ఓవర్ హెడ్‌ట్యాంక్‌లో ఏమైనా పడి ఉండచ్చునని భావించి పరిశీలించగా తొట్టిలోని నీటిపై తెల్లటి నురగ తేలి ఉండటం కనిపించింది. దీంతో వెంటనే నీటి సరఫరా జరగకుండా నిలిపివేశారు. అధికారులు వచ్చి స్థల పరిశీలన చేసిన ట్యాంక్‌లోని నీటిని ఖాళీ చేయించారు. హట్టి పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వారసత్వ కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

మైసూరు, న్యూస్‌టుడే: రాచనగరి, సాంస్కృతిక నగరిగా గుర్తింపు దక్కించుకున్న మైసూరుల వందల సంఖ్యలో వారసత్వ కట్టడాలు, మార్గాలు, ప్రాంతాలు ఉన్నాయని పురావస్తు శాఖ కమిషనర్ దేవరాజు తెలిపారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విఖ్యాత దసరా ఉత్సవాల్లో భాగంగా టౌన్‌హాల్ నుంచి వివిధ వారసత్వ భవనాలు ఉన్న మార్గంలో నిర్వహించిన 'హెరిటేజ్ వాక్'ను జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. టాంగా సవారీ, బైకు సవారీ, వారసత్వ వీధుల్లో నడకతో నగరంలోని నిర్మాణాల శైలి, వాటి ప్రత్యేకతలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మైసూరు రాజులు నిర్మాణాల్లో ఆర్కిటెక్చర్‌కు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. చామరాజనగర విశ్వవిద్యాలయం ఉపకులపతి గంగాధర్, సంగీత విశ్వవిద్యాలయం ఉప కులపతి నాగేశ్ బెట్టకోటెలతో కలిపి 350 మందికి పైగా స్థానికులు నడకలో పాల్గొన్నారు.